నీట్2026లో కృష్ణవేణి విద్యాసంస్థల ప్రభంజనం


3లో

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

సామాజిక న్యాయమే నా లక్ష్యం



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 202 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 18 జులై 2026

# తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం

- ధరణి అక్రమాలపై విచారణకు సిట్ ఏర్పాటు
- ఇక పంచాయితీల నిధులను నేరుగా బ్యాంకులో జమ
- ట్రెజరీలో జమచేసే నిబంధన ఎత్తివేసిన కేబినేట్
- జగిత్యాల జిల్లా డిగ్రీకాలేజీలో పోస్లు భర్తీకి ఆమోదం
- పటాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్లకు భూ కేటాయింపు
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు ఆమోదం
- దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు- సీతారామల అంచనా వ్యయాల పెంపు




**హైదరాబాద్,జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడుగంటలపాటు సమావేశమైన మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి.క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని మిగతా2లో...



# భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి

- హైడ్రోజన్ రైలుతో నూతన శకం ఆరంభం
- తొలి రైతులను జెండా ఊపి ప్రారంభించిన మోడీ
- అనేక ప్రత్యేకతలతో పర్యావరణహితంగా తయారీ

**న్యూఢిల్లీ,జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ పవర్డ్ రైలును ప్రధాని మోదీ శుక్రవారం హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు హర్యాలోని జింద్, సోనిపట్ మధ్య (89 కి.మీ) నడవనుంది. పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనాన్ని కాపాడుకోవడానికి రైల్వే వ్యవస్థలో ఇది ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఈ సందర్భంగా ప్రధాని మోదీ అన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని తయారు చేయడం దేశ గర్వకారణమని వెల్లడించారు. అధునాతన రైల్వే ఇంజినీరింగ్‌లో దేశ సామర్థ్యాలకు ఇది మిగతా2లో...



## నేడు బిఆర్ఎస్ యువ సంగ్రామ సభ

- సరూర్‌నగర్ స్టేడియంలో సభ నిర్వహణ
- పోలీసుల అనుమతి నిరాకరణతో హైకోర్టు అనుమతి

**హైదరాబాద్,జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ ఎంతో ప్రతిష్మాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. శనివారం నాడు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మిగతా2లో...

# ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త


- నగదురహిత వైద్య సేవలకు శ్రీకారం
- ఇచ్చిన హామీ మేరకం పథకం ప్రారంభం



2లో

# రాష్ట్రంలో 12 కొవిడ్ కేసులు

- నాలుగు జిల్లాల్లో చెదురుమొదురుగా నమోదు
- పూణే ల్యాబ్‌కు జన్యుక్రమ విశ్లేషణ నిమిత్తం 5 నమూనాలు
- జులై ఒకటి నుంచి దేశవ్యాప్తంగా 339 కోవిడ్ కేసుల నమోదు



**అమరావతి,జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. రాష్టంలోని పలు జిల్లాల్లో కొత్తగా కోవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదవడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తక్షణమే అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది.వివరాల్లోకి వెళితే, జూన్ 26వ తేదీ నుంచి జులై 16 వరకు మిగతా2లో...



# దేవాదాయ శాఖలో అరుదైన ఘట్టం

- ఏకంగా 191 మందికి ఉద్యోగ నియామక పత్రాలు
- రవీంద్రభారతి వేదికగా మయంత్రి కొండా సురుఖ అందచేత
- దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామన్న మంత్రి
- వర్షాల కోసం ఆలయాల్లో వరుణయాగం నిర్వహణకు సంకల్పం

**హైదరాబాద్,జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేవాలయం అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వైదిక విజ్ఞానానికి, ధర్మ పరిరక్షణకు కేంద్రంగా నిలిచే పవిత్ర క్షేత్రమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అలాంటి దేవాలయాల వైభవాన్ని పరిరక్షించే బాధ్యతను నిర్వర్తించే అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాయిద్య కళాకారులు, దేవాలయ వంట సిబ్బంది సేవలు అత్యంత పవిత్రమైనవని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఎంతో అదృష్టం చేసుకుంటేగానీ దేవుని సేవలో తరించే భాగ్యం దక్కదని మంత్రి సురేఖ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో 191 మంది మతపరమైన ఉద్యోగుల నియామక ఉత్తర్వుల అందజేత కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉద్యోగాలు సాధించిన పలువురికి నియామక పత్రాలు అందజేశారు. వీరిలో రాష్ట్రవ్యాప్తంగా 47 ఆలయాలకు ఎంపికైన అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, మృదంగం, డోలు, సన్నాయి, శృతి, తాళం తదితర విభాగాలకు చెందిన మిగతా2లో...

## న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ కృషి ప్రశంసనీయం

- రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయడం అభినందనీయం
- సుప్రీం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసలు



**న్యూఢిల్లీ,జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసించారు. న్యాయవాదుల సంక్షేమ నిధిని రూ.100 కోట్లతో ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌పై విచారణ సందర్భంగా సీజేఐ మిగతా2లో...

## 60శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

- రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**హైదరాబాద్,జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో ఇప్పటి వరకూ సర్ ప్రక్రియ 60 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని సుల్తాన్పూర్, ఐలాపూర్, పటాన్ చెరులో బీఎల్వోలు నిర్వహిస్తున్న సర్ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. సర్ ప్రక్రియపై బీఎల్వోలను అడిగి వివరాలు మిగతా2లో...

# తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.గ్రామ పంచాయతీల సొంత ఆదాయం పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలనే నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పఠాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ది చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం–2018 సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 70(3)ను సవరించనున్నారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే నిధులు, సొంత ఆదాయంప్రభుత్వ ట్రెజరీలో జమ అయ్యేవి. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం సర్పంచులు లేదా స్థానిక అధికారులకు ఆలస్యమయ్యేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ, ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా సదరు గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతాలోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు ఆమోదం లభించింది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ చట్ట సవరణను తక్షణమే అమలుల్లోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది. ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. మరోవైపు, మంత్రిమండలి నిర్ణయంతో సిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సిట్ ద్వారా భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపైనా ప్రత్యేక దృష్టి సారించనుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని భావిస్తోంది. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించింది. ధరణి ద్వారా జరిగిన భూ వివాదాలన్నింటిపైనా వివరాల సేకరణకు కసరత్తు చేస్తోంది. అక్రమంగా లబ్ది పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు, సంబంధిత పత్రాల పరిశీలనను ప్రారంభించాలని తీర్మానించింది. సిట్ ద్వారా ధరణి అక్రమాలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేసింది.

# దేవాదాయ శాఖలో అరుదైన ఘట్టం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులున్నారు. 191 మంది ఉద్యోగుల నియామకం చేపట్టడం తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, స్టేట్ ఇన్సిటిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ డైరక్టర్ విజయ రాఘవాచార్యులు, దేవాదాయశాఖ ఆర్‌జెసి రామకృష్ణారావు, డిసి కృష్ణప్రసాద్, ఎడిసి లు శ్రీనివాస్, జ్యోతి, ఎసి రామాల సునీత, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, డాక్టర్ ఆర్. శ్రీరామ ఘనాపాటి, కేంద్రమాజీ మంత్రి డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు నాణ్యమైన సేవలు అందించడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ఆలయాల్లో ఖాళీగా ఉన్న మతపరమైన పోస్టులను భర్తీ చేయడం ద్వారా నిత్యకైంకర్యాలు, వేదపారాయణాలు, ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు మరింత క్రమబద్ధంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని స్పష్టం చేశారు. అర్చకుల దేవతారాధన, వేదపండితుల వేద పారాయణం, పరిచారకుల నిత్య కైంకర్య సేవలు, ఆధ్యాత్మికశోభను పెంపొందించే మృదంగ వాయిద్య కళాకారులు, దైవానికి నైవేద్యం, భక్తులకు ప్రసాదాన్ని సిద్ధంచేసే వంటవారు తదితర ఉద్యోగులంతా నిష్ఠతో వుంటేనే దేవాలయాల వైభవం, పవిత్రత, ప్రతిష్ఠలు మరింత ఇనుమడిస్తాయని మంత్రి సురేఖ పేర్కొన్నారు. దేవాలయ ఉద్యోగమంటే ఉపాధి లేదా ఉద్యోగంగా భావించకుండా భగవంతుని సేవ చేసే అరుదైన అవకాశం, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే గొప్ప బాధ్యత అని మీరు భావించాలి. ఈ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వర్తించి భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టాలఅని మంత్రి సురేఖ నియామక ఉత్తర్వులందుకున్న ఉద్యోగులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా దేవాలయాలకు ప్రత్యేకంగా భావించే రోజుల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాలు చెప్పే విధంగా త్వరలో ఉత్తర్వులిస్తామని మంత్రి సురేఖ ప్రకటించారు. త్వరలో ఆయా గుళ్ళలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగస్తులకు పనితీరును బట్టి అవార్డులు ఇస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఇప్పటికే సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించిందని, రాబోయే రోజులు గోదావరి, కృష్ణ నదీ పుష్కరాలను అదే స్థాయిలో నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. గిరిజన జాతరగా ఖ్యాతిగాంచిన మేడారం సమ్మక్క సారక్క జాతర ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తు చేశారు. ఈరాష్ట్రంలో ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో వరుణయాగం నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ యాగాల ద్వారా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయా దేవాలయాల్లో పూజలు చేయాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. మంత్రి సురేఖని దేవాదాయ ఉద్యోగులు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

# న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ కృషి ప్రశంసనీయం

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న న్యాయవాదుల సంక్షేమ పథకాల వివరాలను సీజేఐ ధర్మాసనానికి అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. కెనరా బ్యాంకులో రూ.100 కోట్ల శాశ్వత కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేశామని, దీనిపై వచ్చే వడ్డీ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపింది. అలాగే 2022 నుంచి 2026 వరకు న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్‌కు అదనంగా రూ.7 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించింది. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది న్యాయవాదుల కుటుంబాలకు ఉచిత ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించింది. ప్రతి న్యాయవాది కుటుంబానికి రూ.2లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం అందిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది.

అలాగే ప్రమాదవశాత్తు న్యాయవాది మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.10 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోందని, దేశంలో న్యాయవాదుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది. కాగా, మహిళా న్యాయవాదులకు కోర్టుల్లో కనీస సదుపాయాలు కల్పించే అంశంపై సమీక్ష నిర్వహించి నివేదిక సమర్పించాలని అడ్వకేట్ జనరల్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన మౌలిక వసతులపై వివరాలు సేకరించాలని సూచించారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ నంబర్ 770/2026 విచారణ సందర్భంగా తెలంగాణ న్యాయశాఖ కార్యదర్శి బి.పాపిరెడ్డి ఈ అఫిడవిట్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల వైద్య అత్యవసరాలు, కుటుంబ భద్రత, ఆర్థిక సహాయానికి తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ నిరంతరం పనిచేస్తోందని అఫిడవిట్‌లో ప్రభుత్వం తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయనీ వెల్లడించింది.

# ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

**● అన్ని వర్గాలనూ మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ● రేపు సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సు : బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సమావేశంలో కేటీఆర్**



**హైదరాబాద్, జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. అన్ని వర్గాలనూ మోసం చేసిన ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సును నిర్వహిస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్ నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కామ్‌లు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజా కంటకంగా మారాయని విమర్శించారు. సీఎం చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని వివరించారు. చివరికి యువత, నిరుద్యోగుల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం "యూత్ డిక్లరేషన్" పేరిట భారీ మోసం చేసిందన్నారు. వరంగల్ రైతు సభ అనంతరం, శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు.

**సభకు అడ్డంకులు సృష్టించే అవకాశం**

యువజన సభకు కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందనీ, అలాంటి ప్రయత్నాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్‌తోపాటు పరిసర అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా భారీ సంఖ్యలో యువత స్వచ్ఛందంగా సభకు తరలివస్తారని పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్‌కు వివరించారు. యువజన సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

# భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శమని కొనియాడారు.ఇదిబొగ్గు, డీజిల్ అవసరం లేకుండా కేవలం హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీతో నడుస్తుంది. ఇది రైలును ముందుకు నడపటానికి హైడ్రోజన్‌ను విద్యుత్తుగా మారుస్తుంది. ఈ ప్రక్రియలో ఉప ఉత్పత్తిగా కేవలం నీటి ఆవిరి మాత్రమే వెలువడుతుంది. దీనివల్ల రైలు నడుస్తున్నప్పుడు కార్బన్ ఉద్గారాలు సున్నాగా ఉంటాయి.పర్యావరణహితంగా 'నమో గ్రీన్‌రైలు' పేరుతో నడిచే ఈ రైలుకు 10 కోచ్‌లు, 3200 హెచ్‌పీ ఇంజిన్ ఉన్నాయి. ఈ రైలు సుమారు గంటకు 110 కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది. ఈ రైలులో దాదాపు 2600 మంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. ఈ రైలును చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మించింది. దీంతో హైడ్రోజన్ ఆధారిత రైళ్లను నడుపుతున్న ప్రపంచంలో అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది.ప్రపంచంలో మొట్టమొదటి హైడ్రోజన్ రైలు జర్మనీలో నడిపారు. ఆ తరువాత జపాన్, చైనా, యూఎస్‌లలో కూడా హైడ్రోజన్ రైళ్లను ప్రారంభించారు.

# రాష్ట్రంలో 12 కొవిడ్ కేసులు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో మొత్తం 12 కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. ఈ కేసులను కడప, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో గుర్తించారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ కేసుల్లో నలుగురు మరణించినట్లు ఆరోగ్య శాఖ వర్గాలు ధ్రువీకరించాయి. మిగిలిన బాధితుల్లో ముగ్గురు ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉండగా, ఇతరులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కరోనా లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, టెస్టింగ్ కిట్లు, ఆక్సిజన్ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ప్రస్తుతానికి కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

**హైదరాబాద్,జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగదు రహిత వైద్య సేవల పథకాన్ని ప్రారంభించింది. దీనిని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లాంఛనంగా ప్రారంభించారు. పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులు, ట్రస్ట్ డీడ్‌ను మంత్రులు ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా మొత్తం 17.88 లక్షల మందికి ఆరోగ్య భద్రత లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రైవేట్, 114 ప్రభుత్వ ఆస్పత్రుల్లో లబ్దిదారులకి నగదు రహిత చికిత్స పొందే అవకాశం కల్పించారు. అపోలో, యశోద, కిమ్స్, మెడికవర్, కేర్, కామినేని, కాంటినెంటల్, స్టార్, బసవతారకం వంటి కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ సేవలు పొందొచ్చు. మొత్తం 1,816 వైద్య, శస్త్రచికిత్స ప్యాకేజీలను ఈ పథకం ద్వారా అమలు చేయనున్నారు. ప్రీ–ఆథరైజేషన్ నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్ వరకు పక్రియ మొత్తం పూర్తిగా డిజిటల్ విధానంలో కొనసాగనుంది. ఉద్యోగులు, పెన్షనర్ల భాగస్వామ్యంతో ట్రస్ట్ ద్వారా దీన్ని అమలు చేయనున్నారు. ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌కు సమానంగా ప్రభుత్వం కూడా వాటా ఇవ్వనుంది. దీని అమలు కోసం రాష్ట్రంలో ప్రస్తుతం 12 వెల్‌నెస్ సెంటర్లు ఉండగా.. త్వరలో మరో 24 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇకపై ప్రతి వెల్‌నెస్ సెంటర్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో అనుసంధానం చేయనున్నారు. దీని ద్వారా నాణ్యమైన, పారదర్శక, సుస్థిర వైద్య సేవలను ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసినట్లైంది.

# నేడు బిఆర్ఎస్ యువ సంగ్రామ సభ

(మొదటి పేజీ తరువాయి)

స్టేడియంలో సభ నిర్వహించుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు షరతులతో కూడిన అనుమతిని హైకోర్టు ఇచ్చింది. సభ రోజు హైవేను బ్లాక్ చేయొద్దని విచారణ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించొద్దని పేర్కొంది. పోలీసుల సూచనలు పాటించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు రాష్ట్ర యువతకు అనేక హామీలు ఇచ్చారని బీఆర్ఎస్ యువజన విభాగం నేతలు చెబుతున్నారు. ఆ సమయంలో సరూర్‌నగర్ స్టేడియం నుంచే వారు యూత్ డిక్లరేషన్ ప్రకటించారని వెల్లడిస్తున్నారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో వాగ్దానాలను యువతకు ఇచ్చారని అంటున్నారు. నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వారిని మోసం చేస్తోందని ఆరోపిస్తున్నారు. యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ఇప్పటివరకు అమలు చేయలేదని బీఆర్ఎస్ యువజన విభాగం నేతలు పేర్కొంటున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని గులాబీ నేతలు నిర్ణయించారు. అయితే, ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో తెలంగాణ హైకోర్టును బీఆర్ఎస్ నేతలు ఆశ్రయించగా.. తాజాగా వారి సభకు న్యాయస్థానం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు శనివారం నిర్వహించే సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, విద్యార్థులు, యువత పెద్దఎత్తున తరలిరావాలని గులాబీ నేతలు పిలుపునిచ్చారు. కాగా, ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

# 60శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకున్నారు. శిబిరాల వద్ద వివిధ పార్టీలకు చెందిన వారు ఉండటాన్ని గమనించి.. మీకు పార్టీ నుంచి గుర్తింపు కార్డులు ఏమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు.

సర్ గడువు పొడిగింపు తేదీని దృష్టిలో పెట్టుకొని పక్రియను కొనసాగించాలని సూచించారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం అయిందని తెలిపారు. పీఎల్వో, బీఎల్వోల సహకారంతో సర్ పక్రియ కొనసాగుతోందన్నారు. ఎన్యూమరేషన్ పత్రాలు అందకపోతే.. సూపర్ వైజర్‌లను అడిగి తీసుకోవాలన్నారు.

# నీటి సంపులో దూకి తల్లీ బిడ్డల ఆత్మహత్య

**నాగర్‌కర్నూల్ ,జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. వెల్దండ మండలం పోతేపల్లిలో ఈ ఘటన జరిగింది. ఎనుముల శిరీష (23) తమ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో కుమార్తె మానశ్రీ (3), కుమారుడు వర్షిత్ (4 నెలలు)ను పడేసి.. ఆపై తానూ అందులోకి దూకేసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పిల్లలతో కలిసి శిరీష బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది.

# నీట్2026లో కృష్ణవేణి విద్యాసంస్థల ప్రభంజనం

### 633 మార్కులతో ఎస్. గిరీశ్వరరెడ్డి టాపర్.. పలువురు విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

### విద్యార్థుల విజయంతో ఆనందంలో యాజమాన్యం.. అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారమే విజయ రహస్యం



**ఖమ్మం ప్రతినిధి, జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్2026) ఫలితాల్లో ఖమ్మంలోని కృష్ణవేణి విద్యాసంస్థలు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నాయి. విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి సంస్థకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచారని కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరావు తెలిపారు. ఈ ఏడాది ఫలితాల్లో ఎస్. గిరీశ్వరరెడ్డి 633 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. అలాగే జేఎల్ఎస్ మైత్రేయి (530), మహమ్మద్ సామియా సమర్ (448), జె. వినీత (428), ఎస్. కరుణశ్రీ (426), జి. ప్రహర్ష (425), బి. జ్యోత్స్న (416), ఎస్.కె. ఆయేషా (414), కె. రేణుక (413), కె. అఖిల్ సాయి (401), ఎస్‌కే. ముబీస్ జాకీ (399), కె. అక్షర (397), జి. ప్రవళిక (387), సి.హెచ్. హారిక (385), ఆయేషా మొహమ్మదీ (377), ఎస్. కీర్తన (373), సి.హెచ్. ఇందిర (373) మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు మాట్లాడుతూ.. విద్యార్థుల అంకితభావం, అధ్యాపకుల నిరంతర మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం కలిసి ఈ విజయానికి బాటలు వేసాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉన్నత ర్యాంకులు సాధించి వైద్య విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ఏలూరి వంశీకృష్ణ, ఏవో నిరంజన్ కుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విజేతలను అభినందించారు.

# సామాజిక న్యాయమే నా లక్ష్యం



### - నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తాం

### - తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇన్‌చార్జ్ సలేంద్ర కొమరయ్య

**పెద్దపల్లి, జూలై 17: (పిసిడబ్ల్యూన్యూస్):** పెద్దపల్లి రాజకీయాల్లో బలమైన ముద్ర వేసే దిశగా తెలంగాణ రక్షణ సేన అడుగులు వేస్తోంది. పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కొమరయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ కీలక బాధ్యతలను తనకు అప్పగించిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, బీసీల పక్షపాతిగా ఆమె చేస్తున్న కృషిని కొనియాడారు. శుక్రవారం అధికారికంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో సలేంద్ర కొమరయ్య మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా జిల్లాలో అగ్రవర్ణాల నాయకత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటూ, అణచివేత ధోరణిని అవలంబించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక బీసీ బిడ్డకు పెద్దపల్లి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం ద్వారా కవిత సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని, బీసీలకు 50 శాతం రాజకీయ వాటాను కల్పిస్తామన్న ఆమె హామీ వెనుకబడిన వర్గాలకు కొత్త ఆశను కల్పించిందని ఆయన పేర్కొన్నారు. పార్టీ అధినేత్రి కవిత నాయకత్వంలో వెనుకబడిన తరగతుల కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పాంచజన్యం పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగా అయితే వెనకడుగు వేయకుండా పోరాటం చేశామో, అదే స్ఫూర్తితో తెలంగాణ రక్షణ సేన పార్టీ అధికారంలోకి వచ్చే వరకు పార్టీ అధినేత్రి కవితకు అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. నియోజకవర్గంలోని ఉద్యమకారులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంఘాలన్నింటినీ సమన్వయం చేసుకుంటూ, పార్టీ పిలుపు మేరకు తెలంగాణ రక్షణ సేన పార్టీని పెద్దపల్లిలో శక్తివంతమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతామని సలేంద్ర కొమరయ్య ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కొమరయ్య నియమించడం పట్ల ఆ పార్టీ జిల్లా నాయకులు, బీసీ సంఘం నేత ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. అనేక ఉద్యమాల్లో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, పార్టీ బలోపేతానికి సలేంద్ర కొమరయ్య అందించిన సహకారం అభినందనీయమని కొనియాడారు. ఆయన నాయకత్వంలో నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొంటూ, జిల్లా రక్షణ సేన శ్రేణుల తరపున ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో బొంగోని శంకరయ్య గౌడ్, ఉస్తాం శ్రీనివాస్ ముదిరాజ్, బొంకూరి సుభాష్, కల్వల తిరుపతి, చిట్టుమల్ల హనుమాండ్లు, చిలుక ఆనంద్, గడ్డం వెంకటేష్, ఎంచెర్ల స్వామి, పిల్లి శివ, పల్లె శ్రీనివాస్, మేకల శ్రీనివాస్, రాజ్ కుమార్ యాదవ్, విశ్వతేజ, కల్వల రవీందర్, కారుపాకాల రాజేందర్, కారుపాకాల రమేష్ తదితరులు పాల్గొన్నారు

# హుజురాబాద్ రోడ్డులో ప్రమాదాలకు కేంద్రంగా వైన్ షాప్.. చర్యలు తీసుకోవాలి: కౌన్సిలర్ పూర్ణ చారి

**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి:** పరకాల పట్టణంలోని హుజురాబాద్ రోడ్డులో ఎడమవైపున ఉన్న వైన్ షాప్ ముందు టూ వీలర్ వాహనాలను విచ్చలవిడిగా పార్కింగ్ చేయడం వల్ల తరచూ ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం సమీపంలో మూలమలుపు ఉండటంతో దృష్టి సరిగా పడక ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని వారు పేర్కొంటున్నారు. వైన్ కొనుగోలుదారులు రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలను నిలిపివేయడంతో ఇతర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై పరకాల కౌన్సిలర్ పూర్ణచారి స్పందిస్తూ, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ వైన్ షాప్ వ్యవహారాన్ని అధికారులు అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైన్ షాపులు విద్యాసంస్థలు, దేవాలయాలు వంటి ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాలకు దూరంగా ఉండాల్సి ఉంటుందని ఆయన గుర్తు చేశారు. అయినప్పటికీ ఈ ప్రాంతంలో వైన్ షాప్ కొనసాగుతుండటం వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదకర పరిస్థితులు



ఏర్పడుతున్నాయని అన్నారు. వైన్ షాప్ పక్కనే ఉన్న ఆగ్రోస్ ఏజెన్సీ నిర్వాహకులు, వినియోగ దారులు కూడా పార్కింగ్ సమస్యతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, వైన్ షాప్ ముందు అక్రమ పార్కింగ్‌ను పూర్తిగా అరికట్టా లని, అవసరమైతే షాప్ స్థాన మార్పుపై కూడా అధికారులు పరిశీలించాలని ఆయన కోరారు. ప్రజల ప్రాణాల కంటే వ్యాపారం ముఖ్యమా అని స్థానికులు ప్రశ్నిస్తూ, ప్రమాదాలకు కారణమవుతున్న ఈ పరిస్థితిపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ములుగు జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీకి మల్లంపల్లి గట్టమ్మ వారియర్స్‌కు క్రికెట్ కిట్ అందజేత






**మల్లంపల్లి మండల ప్రతినిధి, జూలై 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కేంద్రంలోని జాకారం స్టేడియంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న మల్లంపల్లి గట్టమ్మ వారియర్స్ జట్టుకు జిల్లా హెల్త్ & మెడికల్ సెల్ వింగ్ చైర్మన్ డాక్టర్ రవిబాబు, మల్లంపల్లి మండల అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి, మల్లంపల్లి గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు, ఉపసర్పంచ్ అంకం సురేష్, వార్డు సభ్యుడు జింక వేణు హనుమంత్ కలిసి క్రికెట్ కిట్‌ను అందజేసి జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు మాట్లాడుతూ, జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటున్న మల్లంపల్లి గట్టమ్మ వారియర్స్ జట్టుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మల్లంపల్లి జట్టులో బిగ్ బాస్ కంటెస్టెంట్, ప్రముఖ యూట్యూబర్ నబీల్ అఫ్రిది ఆడటం గర్వకారణమని పేర్కొంటూ, ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యువత తమ క్రీడా ప్రతిభను నిరూపించుకునేందుకు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు చక్కటి వేదికగా నిలుస్తాయని, ఇటువంటి టోర్నమెంట్ల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు జట్టు భావన, క్రమశిక్షణ పెంపొందుతాయని అన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి జట్లకు ఎంపికయ్యే అవకాశాలు కూడా ఇలాంటి వేదికల ద్వారానే లభిస్తాయని పేర్కొన్నారు. మల్లంపల్లి గట్టమ్మ వారియర్స్ జట్టు కెప్టెన్ జోష్తో పాటు జట్టులోని ప్రతి క్రీడాకారుడికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా హెల్త్ & మెడికల్ సెల్ వింగ్ చైర్మన్ డాక్టర్ రవిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ చారి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చిట్టిరెడ్డి రాంరెడ్డి, కక్కర్ల సాంబయ్య, భవాని స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జింక వేణు, కా. కుమారస్వామి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


# నూతన SHO వెంకటేష్‌కు ఘన సన్మానం...

### - శాలువాతో మర్యాదపూర్వకంగా సత్కరించిన బీజేపీ మల్లంపల్లి మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్



**మల్లంపల్లి మండల ప్రతినిధి, జూలై 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు పోలీస్ స్టేషన్‌కు నూతనంగా SHOగా బాధ్యతలు చేపట్టిన వెంకటేష్ గారిని భారతీయ జనతా పార్టీ మల్లంపల్లి మండల అధ్యక్షులు బైకాని మహేందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన SHO వెంకటేష్ గారు ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పోలీసు సేవలు అందిస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు మచ్చిక రవి గౌడ్, కొండ యుగేందర్, మండల ప్రధాన కార్యదర్శి ఎండిగ రాజు, రాగుల శ్రీకాంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# కారంచేడు ఘటన - దళితుల ఆత్మ గౌరవానికి పరీక్ష: డాక్టర్ తడికమళ్ళ శేఖర్



**కల్లూరు, జులై 17 (పిసిడబ్ల్యూ న్యూస్)** :తెలుగు నేల పైన ప్రకాశం జిల్లా కారంచేడు గ్రామ మాదిగల పైన జరిగిన అమానుష దాడి జరిగి నేటికీ 42 ఏళ్ళు గడిచిన సందర్భంగా సీనియర్ అంబేద్కరిస్ట్ డాక్టర్ తడికమళ్ళ శేఖర్ విడుదల చేసిన ఒక ప్రకటనలో సంఘటన వెనుక ఉన్న చారిత్రక నేపద్యాన్ని వివరించారు. ఈ సంఘటనను కులాధిపత్యం , భూస్వామ్య వ్యవస్థ, హరిత విప్లవం తరువాత బలపడిన శూద్ర ఆధిపత్య వర్గాలు సృష్టించిన సామాజిక సంక్షోభంగా చూడవచ్చు. హరిత విప్లవం కారణంగా శూద్ర భూస్వామ్య వర్గాలు వ్యవసాయ వృద్ధి తో పాటు ఆర్థిక, రాజకీయ శక్తిగా ఎదిగితే అణగారిన దళితులు ఆత్మ గౌరవం , విద్య, రాజకీయ చైతన్యంతో నిండిన పేద వర్గాలుగానే నిర్మితమయ్యారు. ఈ రెండు వర్గాల మధ్య విభిన్న భావజాలాలు ఉన్న నేపద్యంలో భూస్వామ్య వర్గాలు తమ ఆధిపత్యాన్ని చలాయించాలనే ధోరణిలో ఉండగా దళితులు ఆత్మగౌరవంతో స్వేచ్ఛగా జీవించాలనే ఆలోచనలతో ఏర్పడ్డారు. ఈ రెండు భిన్న వర్గాల మధ్య చిన్న చిన్న ఘర్షణలు జరిగినప్పటికీ దళితుల త్రాగునీటి చెరువుపై ఆధిపత్యం ఒక ప్రశ్నగా మారిన దగ్గర అది భీకర హింసకు దారితీసింది. ఈ హింస ఘటన లో మానవత్వం, ప్రజాస్వామ్యశీ, పూర్తిగా అంతరించిపోయింది. మాదిగల హక్కులు పూర్తిగా కాలరాచబడ్డాయి. కారంచేడు సంఘటన తర్వాత దళిత ఉద్యమాలు ఒక కొత్త దశలోకి అడుగుపెట్టాయి. ఈ సంఘటన నుండి దళిత మహాసభ ఆవిర్భవించింది. తెలుగు నేలపైన జరిగిన దాడులు కారంచేడు తర్వాత చుండూరుగా చెప్పబడతాయి . కారంచేడు సంఘటన దళితుల సమస్యలను జాతీయ స్థాయికి చేర్చి కుల వివక్ష, భూస్వామ్య వ్యవస్థ పైన చర్చను ప్రారంభించింది. ఈ సంఘటన పైన ప్రభుత్వం వివిధ చర్యలు తీసుకున్నప్పటికీ హింసకు గురైన బాధితులకు న్యాయం జరిగిందా అనేది చర్చనీయాంశంగానే మిగిలిపోయింది. కుల వివక్ష , గ్రామీణ భూస్వామ్య వ్యవస్థలపై ప్రశ్నలు ప్రభలంగా పెరిగాయి. దళితులు విద్య, పట్టణీకరణ , ఉపాధి అవకాశాల వైపు వెళ్లారు. చట్టపరంగా ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టం, మానవ హక్కుల సంస్థలు, దళిత హక్కుల రక్షణ నెట్వర్క్ విరివిగా పెరిగిన నేపథ్యంలో కారంచేడు సంఘటన ఎల్లప్పుడూ ఒక రిఫరెన్స్ గా ఉంటుంది.

PCW తెలుగు దినపత్రిక

శనివారం 18 జూలై 2026

# ‘యశోద‘లో క్యాన్సర్ చికిత్సకు సరికొత్త సాంకేతికత విప్లవం

**రోబోటిక్ శస్త్రచికిత్స, ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీతో క్యాన్సర్‌కు చెక్**

**రొమ్ము క్యాన్సర్లో ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ**

**యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ సర్జికల్ ఆంకాలజీ, ఆంకాలజీ రోబోటిక్ సైన్సెస్ వైద్యులు డాక్టర్ చినబాబు**

**ఖమ్మం ప్రతినిధి, జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** క్యాన్సర్ నిర్ధారణ చికిత్స రంగంలో యశోద హాస్పిటల్స్ సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చిందని, క్యాన్సర్‌ను నయం చేయడమే కాదు రోగి జీవితాన్ని మరింత మెరుగ్గా మార్చడమే ఆధునిక శస్త్రచికిత్సల లక్ష్యమని హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ సర్జికల్ ఆంకాలజీ, ఆంకాలజీ రోబోటిక్ సైన్సెస్ డాక్టర్ చినబాబు పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్యూమర్ బయాలజీపై మెరుగైన అవగాహన పెరగడంతో నేటి క్యాన్సర్ శస్త్రచికిత్సల లక్ష్యం కేవలం వ్యాధిని తొలగించడం మాత్రమే కాకుండా రోగికి మంచి జీవన నాణ్యతను అందిస్తూ పూర్తిగా నయం చేస్తుందన్నారు. అత్యంత ముఖ్యమైన సాంకేతిక ఆవిష్కరణలలో రోబోటిక్ శస్త్రచికిత్స, ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ ఒకటి అని, ఈ ఆధునిక టెక్నాలజీలు అత్యంత ఖచ్చితత్వం, తక్కువ టిష్యూ డ్యామేజ్, తక్కువ రక్తనష్టం, వేగవంతమైన కోలుకునే అవకాశాలను అందిస్తున్నాయని అన్నారు. హై-డెఫినిషన్ 3డి విజన్, ట్రెమర్ - ఫ్రీ ఇన్స్ట్రుమెంట్స్, మనిషి చేతి కదలికలను అనుకరించే రైస్టెడ్ ఇన్స్ట్రుమెంట్స్ ద్వారా క్లిష్టమైన శస్త్రచికిత్సలను అత్యంత నైపుణ్యంతో నిర్వహించవచ్చునని తెలిపారు. సాధారణంగా చెప్పాలంటే పెద్ద కోతలు లేకుండా కేవలం 8 ఎంఎం చిన్న రంధ్రాల ద్వారా శస్త్రచికిత్స నిపుణుడు తన చేతులు శరీరం లోపల పనిచేస్తున్నట్లుగా ఆపరేషన్ చేయగలుగుతారని, దీని వలన రోగికి తక్కువ నొప్పి, చిన్న మచ్చలు, తక్కువ రక్తస్రావం కలుగుతుందని, ఇంకా స్మార్ట్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కలయికతో శస్త్రచికిత్సలు మరింత ఖచ్చితంగా, సురక్షితంగా మారుతున్నాయని అన్నారు. మహిళల క్యాన్సర్లలో రోబోటిక్ సర్జరీ ముఖ్యంగా గర్భాశయ, అండాశయ క్యాన్సర్లలో రోబోటిక్ శస్త్రచికిత్స గొప్ప ఫలితాలను ఇస్తోందని, రడీకల్ హైస్టెరెక్టమీ, లింఫ్ నోడ్ డిస్సెక్షన్ వంటి క్లిష్టమైన ఆపరేషన్లు సురక్షితంగా చేయవచ్చునని తెలిపారు. గతంలో 4-5 రోజుల ఆసుపత్రి ఉండాల్సి వచ్చేదని, ఇప్పుడు చాలామంది రోగులను 24 గంటల్లోనే డిశ్చార్జ్ చేయవచ్చునని తెలిపారు. **రొమ్ము క్యాన్సర్లో ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ :** రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కూడా ఫ్లోరోసెన్స్ గైడెడ్ టెక్నాలజీ కొత్త దిశను చూపుతోందని, ప్రత్యేకమైన డై ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత, క్యాన్సర్ నుండి మొదట ప్రభావితమయ్యే సెంటినెల్ లింఫ్ నోడ్స్ ప్రత్యేక కెమెరా ద్వారా స్పష్టంగా కనిపిస్తాయని, దీని వలన అవసరమైన లింఫ్ నోడ్స్‌ను మాత్రమే ఖచ్చితంగా తొలగించవచ్చునని, గతంలో లాగే అన్ని లింఫ్ నోడ్స్ తొలగించాల్సిన అవసరం తగ్గి, చేతి వాపు(లైంఫీహెడేమా), నొప్పి, ఇతర సమస్యలు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. ఇది రోగి జీవన నాణ్యతను మరింత మెరుగుపరుస్తుందన్నారు. **యూరాలజీ క్యాన్సర్లలో సరికొత్త మార్పులు** ప్రోస్టేట్, బ్లాడర్, కిడ్నీ, అడ్రినల్ ట్యూమర్ల చికిత్సలో రోబోటిక్ టెక్నాలజీ పెద్దమార్పు తీసుకొచ్చిందని, ప్రోస్టేట్, బ్లాడర్




క్యాన్సర్లలో పెళవిక్ ప్రాంతం చాలా ఇరుకుగా ఉండటం వల్ల ఓపెన్ సర్జరీ క్లిష్టంగా ఉండేదని, ఇప్పుడు రోబోటిక్ సర్జరీ ద్వారా మెరుగైననేర్వ్ ప్రెజర్వేషన్ సాధ్యమై, ఉరినరీ కంటినయన్స్, సెక్సువల్ ఫంక్షన్ మెరుగ్గా కాపాడవచ్చునని తెలిపారు. కిడ్నీ క్యాన్సర్లలో రోబోటిక్ సర్జరీ వలన పార్టియల్ నీఫరెక్టమీ ఎక్కువగా చేయగలుగుతున్నామని, అంటే కేవలం ట్యూమర్ ఉన్న భాగాన్ని మాత్రమే తొలగించి, మిగిలిన ఆరోగ్యకరమైన కిడ్నీని కాపాడటం సాధ్యమవుతోందని, దీని వలన పూర్తి కిడ్నీ తొలగించాల్సిన అవసరం తగ్గి, క్యాన్సర్ నియంత్రణలో ఎలాంటి రాజీలేకుండా మంచి ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. అడ్రినల్ ట్యూమర్లలో కూడా తక్కువ రక్తస్రావం, చిన్న గాయాలు, వేగవంతంగా కోలుకోవడం వంటి ప్రయోజనాలతో సురక్షిత శస్త్రచికిత్సలు చేయవచ్చునని తెలిపారు. **కోలోరెక్టల్ క్యాన్సర్లలో ఖచ్చితత్వం** క్యాన్సర్లలో ఈ టెక్నాలజీ పెద్ద మార్పు తీసుకొచ్చింది. ట్యూమర్ ను ఖచ్చితంగా గుర్తించి తొలగించడం వల్ల చాలాసార్లు పెర్మనెంట్ కలస్టమీ అవసరం లేకుండా చేయగలుగుతున్నామని డాక్టర్ చిన్నబాబు తెలిపారు. స్మార్ట్ స్థాప్లర్ ఫైర్ టెక్నాలజీ ద్వారా బావల్ ఇండ్స్ ను మరింత సురక్షితంగా కలపవచ్చునని, లీకేజీ ప్రమాదం తగ్గి, మెరుగైన నేర్వ్ ప్రెజర్వేషన్ వలన ఉరినరీ, సెక్సువల్ క్వాలిటీ అఫ్ లైఫ్ కూడా బాగుంటుందని అన్నారు. **ఛాతి క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో కొత్తయుగం** ఛాతి శస్త్రచికిత్సలలో కూడా ఇప్పుడు పెద్ద కోతలు వేసే రోజులు పోయాయి. గతంలో లాంగ్ సర్జరీస్ కోసం చెస్ట్ ఓపెన్ చేసి 7-10 రోజుల హాస్పిటల్ స్టే ఉండేది. ఇప్పుడు 8 ఎంఎం చిన్న పోర్ట్స్ ద్వారానే సురక్షితంగా లాంగ్ సర్జరీస్ చేయవచ్చు. ఫ్లయ్ టెక్నాలజీ -క్యాన్సర్ ను వెలుగులో చూపించే సాంకేతికత ఫ్లయ్ ఫ్లూరెసెన్స్ ఇమగెంగ్ అనేది మరో అద్భుతమైన టెక్నాలజీ అన్ని డాక్టర్ చినబాబు తెలిపారు. ప్రత్యేక డై ఇంజెక్షన్ తర్వాత క్యాన్సర్ టిష్యూలు లేదా లింఫాటిక్ మార్గాలు గ్లో అవ్వడం ద్వారా వాటిని మరింత స్పష్టంగా గుర్తించవచ్చు. సెంటినల్ లింఫ్ నోడ్ మాపింగ్ కూడా మరింత ఖచ్చితంగా చేయగలుగుతున్నామన్నారు. **రోగులకు కలిగే ప్రయోజనాలు** తక్కువ నొప్పి, తక్కువ రక్తస్రావం, ఆసుపత్రిలో తక్కువ రోజులు, త్వరగా తిరిగి వెళ్లే అవకాశం, మెరుగైన జీవన నాణ్యత, తక్కువ మచ్చలు, కుటుంబ, భావోద్వేగ ఆర్థిక ఒత్తిడి తగ్గడం తదితర ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ విధంగా రోబోటిక్, ఫ్లోరోసెన్స్ గైడెడ్ టెక్నాలజీలు క్యాన్సర్ శస్త్రచికిత్సలను కేవలం వ్యాధి నివారణకే పరిమితం చేయకుండా, రోగి జీవన నాణ్యతను కాపాడే దిశగా ముందుకు తీసుకెళు న్నాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ మార్కెటింగ్ మేనేజర్ శ్రీకాంత్ దూడ, ఖమ్మం మార్కెటింగ్ మేనేజర్ బాలరాజు పాల్గొన్నారు.

# పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

**ఓబీసీలకు ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి**


**జాతీయ బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి**



**హైదరాబాద్, జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సామాజిక న్యాయం బీసీ బిల్లుతోనే సాధ్యమని జాతీయ బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుంద్ర కుమారస్వామి అన్నారు. ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలు దేశంలో సామాజిక న్యాయానికి కొత్త దిశానిర్దేశం చేసే వేదిక కావాలని, ఈ సమావేశాల్లో బీసీల హక్కులు, సంక్షేమం, సమాన అవకాశాల పరిరక్షణకు ఉద్దేశించిన బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని, అలాగే దేశవ్యాప్తంగా ఓబీసీల అభ్యున్నతి కోసం ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని కాచిగూడలో గల జాతీయ బీసీ దళ్ ప్రధాన కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రక్షణ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మందకాల మణి యాదవ్తో పాటు వివిధ బీసీ, కుల సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. దుంద్ర కుమారస్వామి మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో బీసీల పాత్ర కీలకమైనప్పటికీ వారి సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి అనుగుణమైన విధానాలు ఇంకా పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదన్నారు. బీసీల వాస్తవ పరిస్థితులను అంచనా వేయాలంటే జనాభా గణనలో ప్రత్యేక ఓబీసీ కాలమ్‌ను చేర్చి సమగ్ర కులగణన నిర్వహించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఖచ్చితమైన గణాంకాల ఆధారంగానే అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాలు, నిధుల కేటాయింపులు సమర్థవంతంగా అమలు చేయవచ్చని వివరించారు. సామాజిక న్యాయం అనేది కేవలం నినాదం కాదని, అది రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యత అని ఆయన అన్నారు. బీసీలకు సంబంధించిన అంశాలను సమన్వయంతో పర్యవేక్షించి, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును వేగవంతం చేయడానికి ఓబీసీల కోసం ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడం కాలానుగుణ అవసరమని అభిప్రాయపడ్డారు. అలాంటి వ్యవస్థ ఏర్పడితే బీసీల అభివృద్ధికి దీర్ఘకాలిక విధానాలు రూపొందించే అవకాశం ఉంటుందని చెప్పారు. రానున్న పార్లమెంట్ సమావేశాలు దేశ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే వేదికగా నిలవాలని, బీసీ బిల్లు, ఓబీసీ జనగణన, ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖ ఏర్పాటు వంటి అంశాలను ప్రాధాన్యంగా చర్చించి చట్టబద్ధ నిర్ణయాలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దేశవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలు, కుల సంఘాలు, ప్రజాసంఘాలు సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపుని చ్చారు. సెమినార్‌లో పాల్గొన్న వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, బీసీల సమగ్ర అభివృద్ధికి డేటా ఆధారిత విధానాలు, రాజ్యాంగబద్ధ రక్షణలు, బలమైన సంస్థాగత వ్యవస్థ అవసరమని అభిప్రాయ పడ్డారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీలకు సంబంధిం చిన కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

# అమృత్ భారత్ స్టేషన్ పథకం దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలకం: ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి



**హైదరాబాద్ జూలై 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తుండటం అభినందనీయమని ఎంఎల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను రూ. 35.61 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడం తెలంగాణకు గర్వకారణమని వారు చెప్పారు. ఈ అభివృద్ధి వల్ల ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, నగర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇది మరో కీలక అడుగని ఎంఎల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపడుతున్న రైల్వే స్టేషన్ల అభివృద్ధి భారత రైల్వేలను మరింత ఆధునికంగా తీర్చిదిద్దుతుందని ఎంఎల్సీ ఏవీఎన్ రెడ్డి చెప్పారు.

# డ్రగ్స్‌పై కల్లూరు పోలీసుల ఉక్కుపాదం

**పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, విద్యాసంస్థల వద్ద విస్తృత తనిఖీలు**

**మాదకద్రవ్యాల విక్రయం, రవాణాపై కఠిన చర్యలు... సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యమే: కల్లూరు ఎస్సై డి హరిత**




**కల్లూరు, జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మాదకద్రవ్యాల నిర్మూలనకు కల్లూరు పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై హరిత ఆధ్వర్యంలో శుక్రవారం పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై హరిత మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, క్రయవిక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని మాదకద్రవ్యాలు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని పేర్కొన్న ఆమె, విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఎస్సై హరిత హామీ ఇచ్చారు. సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# సత్తుపల్లిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

**సర్ 2026 పై అవగాహన**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే సండ్ర విమర్శలు**

**సీతారామ ప్రాజెక్టు కేసీఆర్ ఘనతేనన్న**

**సండ్ర వెంకట వీరయ్య రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వానికి డిమాండ్**



**సత్తుపల్లి, జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం స్థానిక లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటూ ప్రచారం చేస్తుంటే, తెలంగాణలో మాత్రం క్రెడిట్ చోరీ జరుగుతోందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషే కారణమని పేర్కొన్నారు. ప్రాజెక్టు క్రెడిట్ కోసం కాంగ్రెస్ మంత్రుల మధ్య పోటీ నెలకొనడం విచారకరమని, ఒక మంత్రికి తెలియకుండా మరో మంత్రి పర్యటనకు రావడం వారి అంతర్గత విభేదాలకు నిదర్శనమని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని సండ్ర విమర్శించారు. ప్రజల ఆందోళనల తర్వాతే పంపులను ప్రారంభించారని, ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితులు రెండో ఎండాకాలాన్ని తలపిస్తున్నాయని అన్నారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించి రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏ సర్వే చూసినా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే పోలీసులు అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు ప్రత్యేక ఓటర్ జాబితాపై సమీక్షా సమావేశం

- జూలై 18న కల్లూరు సబ్-కలెక్టర్ కార్యాలయంలో సమావేశం
- పార్టీ ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని పిలుపు



**కల్లూరు, జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** 116 సత్తుపల్లి (ఎస్సీ) శాసనసభ నియోజకవర్గానికి సంబంధించిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తెలిపారు. ఎన్నికల నమోదు అధికారి 116 సత్తుపల్లి శాసనసభ నియోజకవర్గం కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధ్యక్షతన ఈ సమావేశం జూలై 18 శనివారం ఉదయం 10:30 గంటలకు కల్లూరు సబ్–కలెక్టర్ కార్యాలయంలో జరగనుంది. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం అమలు, పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రతినిధులు నిర్ణీత సమయానికి సమావేశానికి హాజరై తమ విలువైన సూచనలు, సలహాలు అందించి అధికారులకు సహకరించాలని ఎన్నికల నమోదు అధికారి కోరారు.

# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

- వికలాంగులు, నిరుపేద కుటుంబాలకు పాస్టర్ ఇశ్రాయేలు చేయూత
- ఆపదలో అండగా నిలిచిన పాస్టర్ ఇశ్రాయేలు.. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం
- మానవసేవే మాధవసేవ..
- అవసరంలో ఉన్నవారికి చేయూత.. పలువురికి ఆదర్శంగా పాస్టర్ ఇశ్రాయేలు సేవాభావం
- సమాజానికి స్ఫూర్తి.. వికలాంగులు, అనారోగ్య బాధితులకు ఆర్థిక సహాయం అందజేత





**తల్లాడ, జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజంలో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని మరోసారి చాటిచెప్పారు తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ నాయకులు. తల్లాడ మండలంలోని ఇద్దరు నిరుపేద, అనారోగ్య బాధిత కుటుంబాలకు గురువారం తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్థానిక పాస్టర్ కమ్మంపాటి ఇశ్రాయేలు ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన ఆధూరి యోనా, మరియమ్మ దంపతుల కుమార్తె బ్లెస్సి కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా, ఆమె చికిత్స కోసం రూ.2 వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే గొల్లగూడెం గ్రామానికి చెందిన తెల్లపుట్ట కృష్ణయ్య పక్షవాతంతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారి కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా పాస్టర్ కమ్మంపాటి ఇశ్రాయేలు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అనే భావనతో నిరుపేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు తమ వంతు సహాయం అందిస్తున్నామని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత మేర వెనుకబడిన, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలిచి, సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తాయని స్థానికులు అభిప్రాయ పడ్డారు. పాస్టర్లు గుంటి బాబురావు, దేవ సహాయం, నిరీక్షణ రావు తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ సంజీవ్ కుమార్‌కు ఘన సన్మానం



**జమ్మికుంట 17(పిసిడబ్ల్యూ న్యూస్):** జమ్మికుంట పట్టణంలోని హుజురాబాద్ రోడ్డులో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జమ్మికుంట శాఖ మేనేజర్ సంజీవ్ కుమార్ ను శుక్రవారం రోజున జమ్మికుంట ప్రముఖ వ్యాపారవేత ఎలిమి రాజేంద్రప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్ పబ్బు శ్రీనివాస్, జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జమ్మికుంట బ్రాంచ్ మేనేజర్ గా సంజీవ్ కుమార్ రెండు సంవత్సరాలు ఉత్తమ సేవలు అందించి వరంగల్ కు బదిలీ అయ్యారు, ఈ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత ఎలిమి రాజేంద్రప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్ పబ్బు శ్రీనివాస్ లు మాట్లాడుతూ మేనేజర్ సంజీవ్ కుమార్ చేసిన సేవలను కొనియాడారు, జమ్మికుంట బ్రాంచ్ ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు, గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు నిరుద్యోగ యువతకు మరింతగా రుణ సదుపాయం అందించాలని కోరారు, గత రెండు సంవత్సరాలుగా జమ్మికుంట బ్రాంచ్ లో మేనేజర్ గా పని చేస్తూ సోదరులకు సేవలు అందించి ప్రజల మన్నలను పొందిన సంజీవ్ కుమార్ ను అభినందించారు, ఈ సందర్భంగా వరంగల్ కు బదిలీ అయిన జమ్మికుంట బ్రాంచి మేనేజర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో రెండు సంవత్సరాలుగా జమ్మికుంట బ్రాంచ్ లో పనిచేసే అవకాశం లభించిందని స్థానిక ప్రజలతో ఏర్పడిన అనుబంధం పరిచయాలు బ్యాంక్ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని తెలిపారు, ఉద్యోగాన్ని తను దైవంగా భావించి విధులు నిర్వర్తిస్తానని పేర్కొన్నారు, ఈ ప్రాంతం నుండి బదిలీ కావడం బాధగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జమ్మికుంట బ్రాంచ్ సర్వీస్ మేనేజర్ రాజశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ ప్రసాద్, క్యాషియర్స్ హేమ భారతి, హేన మహమ్మద్, ఎస్బిఐ లైఫ్ పింగిలి సురేష్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు ‘తెలుగుదేశం కుటుంబం‘ అండగా ఉంటుంది







### టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ తిరునగరి జ్యోత్స్నా

### ఆపద తమ్ముళ్లకు ప్రొఫెసర్ జ్యోత్స్నా కొండంత భరోసా!

**ఖమ్మం ప్రతినిధి, జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాజకీయాలకతీతంగా కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవడమే తెలుగుదేశం పార్టీ నైజమని, ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడూ కొండంత అండగా ఉంటుందని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ తిరునగరి జ్యోత్స్నా స్పష్టం చేశారు. ప్రమాదాల బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ శ్రేణులను శుక్రవారం పరామర్శించి, వారిలో మానసిక ధైర్యాన్ని నింపేందుకు ఆమె ప్రత్యేకంగా ఖమ్మం విచ్చేశారు. **అధైర్యపడకండి.. మీ వెనుక పార్టీ ఉంది** ఇల్లందు నియోజకవర్గం 1వ వార్డుకు చెందిన నిబద్ధత కలిగిన టీడీపీ కార్యకర్త బాసాని నాగేశ్వరరావు ఇటీవల ముదిగొండ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఖమ్మంలోని మమత హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జ్యోత్స్నా శుక్రవారం ఆసుపత్రికి చేరుకుని నాగేశ్వరరావును, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఆమె, కుటుంబ సభ్యుల చేతులు పట్టుకుని, “ఏమాత్రం అధైర్యపడవద్దు, పార్టీ మీకు సర్వదా అండగా ఉంటుంది“ అంటూ హృదయానికి హత్తుకునేలా నమ్మకాన్ని ఇచ్చారు. అలాగే ప్రమాదవశాత్తు కాలు విరిగి బాధపడుతున్న ఖమ్మం నియోజకవర్గ యువ నాయకుడు బైరు అప్పారావును కూడా ఆమె పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మనోధైర్యాన్ని నింపారు. పరామర్శల అనంతరం ప్రొఫెసర్ జ్యోత్స్నా తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయానికి చేరుకుని, పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఆ తర్వాత ఖమ్మంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించి, క్షతగాత్రులైన కార్యకర్తలు సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి కోలుకోవాలని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. తెలంగాణ ఆడబిడ్డ, పార్టీ గళమైన ప్రొఫెసర్ జ్యోత్స్నకు ఖమ్మం జిల్లా నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ పరామర్శల కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు కేతినేని హరీష్, వడ్డేం విజయ్, గుత్తా సీతయ్య, ఆర్ఎం వరలక్ష్మి, రామయ్య, ఇల్లందు నేతలు ముద్రగడ వంశీ, రమేష్ బాబు, నవీన్, చలసాని ఝాన్సీ, పోటు సరస్వతి, రాటకొండ పావని, చుండూరు రాజరాజేశ్వరి, కోనేరు రాణి, మందపల్లి రజిని, మేకల సత్యవతి, కామ అనిత, తాడిశెట్టి స్వాతి, రంగిశెట్టి మంగమ్మ, పెనుగొండ ఉపేందర్, వక్కంతుల వంశీ, కూచిపూడి జై, నాగండ్ల లక్ష్మణ్, గుండెపిన్ని నాగేశ్వరరావు, బోయిన వెంకన్న, కాసాని బ్రహ్మం తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాధితులకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు.


# పెనుబల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో సమస్యల గుట్ట

### టీచర్లు లేరు.. శిథిల భవనం.. బురదలో విద్యార్థుల అవస్థలు

### టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి మెయిన్ రోడ్డు నుంచి ఎస్సీ, బీసీ హాస్టళ్ల వరకు సీసీ రోడ్డు వేయాలని సీపీఎం డిమాండ్





**పెనుబల్లి, జూలై 17 (పీసీడబ్ల్యూ న్యూస్) :** పెనుబల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో నెలకొన్న సమస్యలు విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గాయం తిరుపతిరావు అధ్యక్షతన పాఠశాలలో నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో పలు సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ, పాఠశాలలో క్రాఫ్ట్, బయాలజీ, ఫిజికల్ సైన్స్ వంటి కీలక సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే నాన్ టీచింగ్ సిబ్బంది కొరత కూడా పాఠశాల నిర్వహణపై ప్రతికూల ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల పడమర వైపున ఉన్న ఐదు తరగతి గదుల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, వర్షం పడితే గదులన్నీ నీటితో నిండిపోతుండటంతో వాటిని వినియోగించలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రమాదకరంగా మారిన ఆ భవనాన్ని వెంటనే తొలగించి, అదే స్థలంలో నూతన భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. వర్షాకాలంలో పాఠశాల ఆవరణ, ఆట స్థలం పూర్తిగా బురదమయంగా మారడంతో విద్యార్థులు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మెయిన్ రోడ్డు నుంచి ఎస్సీ, బీసీ హాస్టళ్ల వరకు సిమెంట్ (సీసీ) రోడ్డు నిర్మించాలని, ప్లే గ్రౌండ్‌లో మట్టితో ట్రాక్ ఏర్పాటు చేసి వర్షపు నీరు బయటకు వెళ్లేలా డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తే విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయని, అధికారులు ఇకనైనా స్పందించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. విద్యార్థుల భద్రత, విద్యా ప్రమాణాల దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సర్వే కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మిట్టపల్లి నాగమణి, కంద సత్యం, రాజినేని మంగమ్మ, మరి రజిని తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో వర్షాలు కురవాలి అని గ్రామదేవతలకు జలాభిషేకం

### వాడవాడకు తిరిగి కప్పతల్లి ఊరేగింపు







**సైదాపూర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** సైదాపూర్ మండలం ఆకునూరు గ్రామంలో సర్పంచ్ గుర్రాల స్వతంత్ర ఆధ్వర్యంలో శుక్రవారం రోజున గ్రామ ప్రజలు మహిళలు సకాలంలో వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించి, కప్పతల్లి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోకలి బండకు కప్పను వస్త్రముతో కట్టి వాడ వాడకు గడప గడపకు వెళ్లి, కప్పతల్లి పూజలు నిర్వహించి , కప్పతల్లి కడవడే నీళ్లు అంటూ కప్పతల్లి పాటలు పాడారు. గ్రామంలోని ప్రజలు చిన్నారులు పెద్దలు భక్తి శ్రద్ధలతో కప్పతల్లి రోకలి కట్టుకున్న వారిపై బిందెలతో నీళ్లు పోసి వాన దేవుడిని వర్షం కురవాలి అని ప్రార్థించారు .గ్రామ సర్పంచ్ గుర్రాల స్వతంత్ర మాట్లాడుతూ వర్షాకాలం మొదలై నీటికి రెండు నెలలు కావస్తున్నా కూడా సకాలంలో వర్షాలు లేక రైతులు గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ,వరుణ దేవుడు కరుణించి సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిపించాలని నాటు వేసిన పొలాలకు కూడా పత్తి మొక్కజొన్న మొదలైన పంటలకు నీరు లేక రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కప్పతల్లి గడపగడపకు ఊరేగింపు చేసి అనంతరం ఆకునూరు గ్రామంలోని రామలింగేశ్వర శివాలయంలో శివలింగానికి జలాభిషేకం, ఎల్లమ్మ తల్లికి జలాభిషేకం, పోచమ్మ తల్లికి జలాభిషేకం, ఆంజనేయ స్వామికి జలాభిషేకం ,నాగులమ్మకు జలాభిషేకం, గ్రామంలోని గ్రామదేవతలకు జలాభిషేకం చేసి సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు రైతులు గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని దేవుళ్లను ప్రార్థించినట్లు గ్రామ సర్పంచ్ గుర్రాల స్వతంత్ర తెలిపారు . గ్రామంలోని మత్తడిబండ పై గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వరుద పాయసాన్ని గ్రామ ప్రజలు ప్రసాదాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్రాల స్వతంత్ర తోపాటు పాలకవర్గ సభ్యులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం నిధులిస్తే...జీతాలకు, కరెంట్ బిల్లులకు మళ్లిస్తారా?



**● ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు ● ప్రభుత్వ తీరు మార్చుకోవాలి ● లేనిపక్షంలో కేంద్ర నిధులను నేరుగా పంచాయతీ అకౌంట్లలోనే జమ చేసే అంశాన్ని పరిశీలిస్తాం ● కేంద్రానికి లేఖ రాస్తా ● గడువులోగా అమ్రుత్ పనులు పూర్తి చేయకుంటే చర్యలు తప్పవు ● నిధులు వెనక్కు వెళ్లే ప్రమాదం ఉంది ● కేంద్ర నిధులతోనే తెలంగాణలో అభివృద్ధి జరుగుతోంది ● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కామెంట్స్ ● సిరిసిల్లలో రూ.105 కోట్లతో కార్గిల్ చెరువు పునరుద్దరణ పనులకు కేంద్ర మంత్రి శంకుస్థాపన ● జిల్లా కలెక్టర్, ఎస్పీసహా ఉన్నతాధికారుల హాజరు**

**సిరిసిల్ల 17(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులను కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతభత్యాలకు మళ్లించడం దుర్మార్గమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సర్పంచులను బెదిరించి, ఒత్తిడి తెస్తోందన్నారు. "అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను కరెంట్ బిల్లులు, జీతాలకు ఎట్లా మళ్లిస్తారు? ఇది నిబంధనలకు విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే కేంద్రానికి లేఖ రాయాల్సి ఉంటుంది. అవసరమైతే ఆర్థిక సంఘం నిధులు నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తాం"అని చెప్పారు. గ్రామ పంచాయతీల కరెంట్ బిల్లులు, సిబ్బంది జీత భత్యాలకు కూడా నిధులివ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందా? అని మండిపడ్డారు. సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు సిరిసిల్ల పట్టణంలో పర్యటించారు. జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్, ఎస్పీ మహేశ్ బి.గీతే, పలువురు ఉన్నతాధికారులు మంత్రికి స్వాగతం పలికారు. ఆయా అధికారులతోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపీ, స్థానిక బీజేపీ నేతలతో కలిసి అమ్రుత్ 2 స్కీం కింద రూ.105 కోట్ల నిధుల అంచనా వ్యయంతో చేపట్టిన కార్గిల్ చెరువు పునరుద్దరణ, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. పక్కనే ఉన్న కార్గిల్ యుద్ద శకటాన్ని సందర్శించారు. కార్గిల్ యుద్దంలో వీర మరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించారు. జై జవాన్, జై కిసాన్ అంటూ నినదించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే....అమ్రుత్ 2 స్కీం కింద రూ.1.32 కోట్లతో కార్గిల్ చెరువు పునరుద్దరణ, సుందరీకరణ పనులు చేపట్టి ఈ చెరువును సుందరంగా తీర్చిదిద్దుతాం. మురుగునీరు రాకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటాం. దీంతోపాటు సిరిసిల్ల పట్టణ ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణంలో ఈ చెరువును సందర్శించేలా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం. నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం. లేనిపక్షంలో చర్యలు తప్పవని చెప్పాం. అమ్రుత్ కింద కేంద్రం పెద్ద ఎత్తున నిధులిస్తున్నా గడువులోగా పనులు చేయడం లేదు. దీనివల్ల నిధులు వెనక్కు వెళ్లే ప్రమాదముంది. ఇదే విషయాన్ని కాంట్రాక్టర్ కు చెప్పిన. ఏదో ఒక రాజకీయ నాయకుడిని పట్టుకోవడం, రాష్ట్రమంతా కాంట్రాక్ట్ పని తీసుకోవడం, సరిగా పనులు చేయకుండా నాణ్యత లేకుండా ఇబ్బంది పెట్టడం కొంతమందికి అలవాటుగా మారింది. ఎక్కడా పూర్తి స్థాయిలో పనులు చేయడం లేదు. ఇతర కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వకుండా సిండికేట్ లా మారి ఇబ్బందులు పెడుతున్నారు. ఇకపై అట్లా జరగకుండా చూస్తున్నాం.నిజానికి అమ్రుత్ స్కీంను గొప్ప ఆశయంతో ప్రధానమంత్రి మోదీగారు ప్రవేశపెట్టారు. పట్టణాల్లో ప్రతి ఇంటికి నూటికి నూరు శాతం నల్లా కనెక్షన్ అందించడంతోపాటు మురుగునీటి(సీవరేజ్) సౌకర్యం కల్పించడం, పట్టణాలను వాటర్ సెక్యూర్ సిటీస్ గా తీర్చిదిద్దాలనే గొప్ప లక్ష్యంతో మోదీగారు 2015లో అమృత్ (ూవీ=ఖు ౘఖ్రీ వీఱఅంంఱశీఅ టశీతీ =వయబజవఅఫ్ఱశీఅ ఖఅ ఖతీఃఖఅ ఎతీఖఅంటశీతీఏఱశీఅ) పథకాన్ని ప్రారంభించారు. అమృత్ 1 మిషన్ కింద రూ.77 వేల 640 కోట్ల వ్యయం అంచనా వేస్తే కేంద్రం 35 వేల 990 కోట్లు కేటాయించింది. 2021 నాటికి అమృత్ 1 స్కీం పూర్తయ్యింది. ఆ తరువాత 2021 అక్టోబర్ లో అమృత్ 2 స్కీం పేరుతో 2 లక్షల 99 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తే, అందులో కేంద్రం తన వాటాగా 76 వేల 760 కోట్లు కేటాయించింది.తెలంగాణ విషయానికొస్తే... అమృత్ 1 కింద 1660 కోట్లు, అమృత్ 2 కింద 3వేల 429 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. కరీంనగర్ పార్లమెంట్ విషయానికొస్తే...కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు సిరిసిల్ల, వేములవాడ, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీలు అమ్రుత్ పథకం కింద దాదాపు 400 కోట్ల రూపాయలను కేటాయించింది. అందులో ఈ సిరిసిల్ల మున్సిపాలిటీకి 105 కోట్ల 57 లక్షల రూపాయలను ఖర్చు చేస్తున్నాం.కేంద్రం పెద్ద ఎత్తున తెలంగాణకు నిధులిస్తోంది. 12 ఏళ్లలో 13 లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. అయినా కేంద్రం ఏమిచ్చింది? తెలంగాణకు అన్యాయం చేస్తుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పచ్చి అబద్దాలాడుతున్నరు.

అసలు తెలంగాణలో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతుందంటే కేంద్రం ఇస్తున్న నిధులే కారణం. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా నయాపైసా కూడా మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు ఇవ్వడం లేదు. సిరిసిల్ల పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా నయాపైసా ఇయ్యలేదు. మోదీ ప్రభుత్వం వివిధ స్కీంల కింద నిధులు ఖర్చు చేస్తున్నాం. బాధాకరమైన విషయం ఏందంటే... అమ్రుత్ స్కీం కింద కేంద్రం నిధులిస్తున్నాం. ఇదే విధంగా గ్రామాల అభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం నిధులిస్తే...వాటిని అభివృద్ధి పనులకు కాకుండా కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతాల కోసం ఖర్చు చేస్తూ నిధులను డైవర్ట్ చేస్తున్నారు. నేను రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా. కేంద్రం ఏ ఉద్దేశంతో నిధులిస్తుందో... ఆ లక్ష్యానికే ఉపయోగించాలి. లేనిపక్షంలో ఆ నిధులను దారి మళ్లిస్తే మాత్రం ఊరుకునేది లేదు. ప్రభుత్వం తీరు మారకుండా కేంద్రానికి లేఖ రాస్తే నిధులు ఆగిపోయే ప్రమాదముందని హెచ్చరిస్తున్నా. అదే సమయంలో కేంద్ర నిధులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తాం. సిబ్బంది జీతభత్యాలు, కరెంట్ బిల్లులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం పైసలియ్యకపోతే ఎట్లా? కేంద్రం నిధులను దారి మళ్లించడం నిబంధనలకు పూర్తి విరుద్ధం. సర్పంచులను బెదిరించి సిబ్బంది జీతాలకు కేంద్ర నిధులను ఎట్లా ఖర్చు చేస్తారు? ఇకనైనా తీరు మార్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా.

---

# ప్రజల దాహం తీర్చే చేతులకు భరోసా..

**కనిగిరి హిల్స్‌లో మిషన్ భగీరథ, సబ్‌స్టేషన్ కార్మికుల సమగ్ర వివరాల సేకరణ**

**కార్మిక సంక్షేమమే లక్ష్యం..**

**ప్రతి శ్రామికుడి సేవకు ప్రభుత్వ గుర్తింపు దిశగా కీలక అడుగు**



**ఖమ్మం ప్రతినిధి, జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రతి ఇంటి దాహాన్ని తీర్చే నీటి బిందువు వెనుక ఒక కార్మికుడి చెమట చుక్క దాగి ఉంటుంది. మండుటెండైనా, కుండపోత వర్షమైనా, అర్ధరాత్రి అత్యవసర పరిస్థితులైనా ప్రజలకు తాగునీటి సరఫరా లో ఎలాంటి అంతరాయం కలగకుండా నిశ్శబ్దంగా విధులు నిర్వర్తించే మిషన్ భగీరథ, సబ్‌స్టేషన్ కార్మికుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కనిగిరి హిల్స్‌లో శుక్రవారం సమగ్ర వివరాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వ్యక్తిగత వివరాలు, విధుల స్వరూపం, పనిచేస్తున్న ప్రాంతం, నియామక సంస్థ, వేతనాలకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు క్షుణ్ణంగా నమోదు చేశారు. భవిష్యత్తులో కార్మికులకు సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, పరిపాలనా అవసరాలు, ప్రభుత్వ నిర్ణయాలకు అవసరమైన ఖచ్చితమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.రోజూ ప్రజల అవసరాల కోసం శ్రమిస్తూ తమ కుటుంబాలకు దూరంగా, ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్న కార్మికుల సేవలకు తగిన గుర్తింపు లభించేలా ఈ వివరాల సేకరణ దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రతి కార్మికుడి కష్టం ప్రభుత్వ దృష్టికి చేరి, వారి హక్కులు, సంక్షేమం, భద్రతకు మరింత ప్రాధాన్యం లభించేలా ఈ ప్రక్రియ ఉపయోగపడనుంది. కార్మికుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించిన వారు, ప్రతి ఉద్యోగి సమాచారం పూర్తిగా, ఖచ్చితంగా నమోదు కావాలని సూచించారు. "ప్రజలకు నిత్యం స్వచ్ఛమైన తాగునీటిని అందించడంలో కార్మికుల పాత్ర అమూల్యం. వారి శ్రమకు గౌరవం దక్కేలా, సంక్షేమానికి అవసరమైన ప్రతి చర్యను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేయాలంటే ఇలాంటి సమగ్ర సమాచారం ఎంతో అవసరం" అని పేర్కొన్నారు. ప్రజల జీవితాల్లో నీటి వెలుగులు నింపుతున్న ఈ శ్రామికుల సేవలను గుర్తించి, వారి కష్టసుఖాలకు అండగా నిలవాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం మానవీయ పరిపాలనకు, కార్మిక సంక్షేమానికి మరో మంచి ముందడుగుగా నిలుస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ జూనియర్ ఇంజనీర్ (జెఈ) వీరబాబు, ఎన్‌సీసీ మేనేజర్ యుగంధర్, మిషన్ భగీరథ ఐఎన్‌టీయూసీ యూనియన్ కార్యదర్శి బాల కృష్ణ, మిషన్ భగీరథ సబ్‌స్టేషన్ ఆపరేటర్ అసోసియేషన్ అధ్యక్షుడు తగరం శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక ప్రోత్సాహకం: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జూలై – 17( పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులు నష్టపోకుండా వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగు పై ప్రత్యేక ప్రోత్సాహకం అందిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా నాణ్యమైన మొక్కల సరఫరాతో పాటు అంతర పంటల సాగు, తోట నిర్వహణ కోసం నాలుగు సంవత్సరాల పాటు ప్రభుత్వం రాయితీలు అందజేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ పంట ద్వారా రైతులు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.జిల్లాలో పట్టా భూమి కలిగి ఆయిల్ పామ్ సాగు చేయదలచిన ఒంటరి మహిళా రైతులకు ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం అందించే నాలుగు సంవత్సరాల రాయితీలతో పాటు, రైతుకు అయ్యే అదనపు వ్యయాన్ని జిల్లా కలెక్టర్ ఆధీనంలోని నిధుల ద్వారా ప్రత్యేక రాయితీగా అందించనున్నట్లు తెలిపారు.జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించడం, రైతులను ప్రత్యామ్నాయ లాభదాయక పంటల వైపు ప్రోత్సహించడం, అలాగే ఒంటరి మహిళలను ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ ప్రత్యేక ప్రోత్సాహకాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.అర్హులైన ఒంటరి మహిళా రైతులు ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయిల్ పామ్ సాగు చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పొందాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం సమీప ఉద్యాన శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో కోరారు.

---

# భరత్‌కు కొత్త ఆటో కొనిచ్చిన బండి సంజయ్

**హిందుత్వ నినాదాలున్న ఆటోను స్వయంగా నడుపుకుంటూ కరీంనగర్ లో తిరిగిన కేంద్ర మంత్రి**

**జ్యోతినగర్ నుండి మంకమ్మతోట, గీతాభవన్, బస్టాండ్, బోయవాడ మీదుగా లక్ష్మీనగర్ దాకా వెళ్లిన బండి సంజయ్**

**లక్ష్మీనగర్‌లో భరత్‌కు పాత ఆటో స్థానంలో కొత్త ఆటోను అందజేసిన కేంద్ర మంత్రి**

**హిందుత్వ నినాదాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నందుకు గర్వంగా ఉందన్న బండి సంజయ్**

**భరత్‌కు పూర్తిగా అండగా ఉంటానని చెప్పిన కేంద్ర మంత్రి**

**లక్ష్మీనగర్‌లో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన బండి సంజయ్**

**కరీంనగర్ టౌన్ జూలెం 17(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆటోవాలాగా మారారు. ఈరోజు సాయంత్రం కరీంనగర్ లో తన ఇంటి నుండి స్వయంగా ఆటోను నడుపుకుంటూ బయలుదేరారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు ప్యాసింజర్ సీట్లో కూర్చోగా, పక్కనే హిందుత్వ నినాదాలను ప్రచారం చేస్తున్న ఆటో డ్రైవర్ భరత్ ను పక్కనే కూర్చోపెట్టుకుని జ్యోతి నగర్, మంకమ్మ తోట, గీతాభవన్ చౌరస్తా, ప్రతిమ చౌరస్తా, బస్టాండ్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, బోయవాడ మీదుగా లక్ష్మీనగర్ దాకా ఆటో నడిపారు. వివరాల్లోకి వెళితే... వనపర్తి జిల్లాకు చెందిన చంచరి భరత్ కుమార్(24) తన ఆటో వెనుక కవర్ పై "Changing your religion is like your father (నీ మతాన్ని మార్చుకోవడం అంటే నీ తండ్రిని మార్చుకోవడం లాంటిది), Anyone born on this earth is a hindu& jai Sriam (ఈ భూమిపై పుట్టిన ప్రతి ఒక్కరూ హిందువులేడ జై శ్రీరామ్) అని నినాదాన్ని రాయించుకున్నారు. ఈనెల 13న భరత్ ప్యాసింజర్ ను ఎక్కించుకుని మెహిదీపట్నం నుండి జీడిమెట్లకు వెళుతుండగా మజ్లిస్ పార్టీకి చెందిన నలుగురు యువకులు




ఆటోను వెంబడించారు. 'ఆటో వెనుక ఏం రాసినవ్ రా... ఏమనుకుంటున్నవ్ రా...ఆ స్లోగన్స్ తీసేస్తావా? లేదా?" అంటూ బండ బూతులు ఆటో కవర్ వెనుకనున్న నినాదాలను గీకేశారు. ఆటో కవర్ ను చించి వేశారు. కొద్దిసేపటి తరువాత అత్తాపూర్ ఎస్ఐ శ్రీనివాసులు ఫోన్ చేసి "ఆటోమీద అట్లాంటి స్లోగన్స్ ఎట్లా రాస్తావ్? హైదరాబాద్ లో ఆటో తిరగాలని ఉందా? లేదా? వెంటనే స్టేషన్ కు రా. నీమీద కంప్లయింట్ వచ్చింది. రాకపోతే నీ ఆటోను సీజ్ చేస్తా"అంటూ బెదిరించారు.దీంతో భరత్ స్థానిక బీజేపీ నేతలను వెంట బెట్టుకుని రెండ్రోజుల క్రితం కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి వచ్చి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కలిసి జరిగిన విషయాన్ని వివరించారు. ఫోటోలు, వీడియోలు చూపించారు. వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్ "బాధపడొద్దు. నేను అండగా ఉంటా"అని భరోసా ఇవ్వడమే కాకుండా హిందుత్వ సిద్ధాంతాన్ని నమ్మి ప్రజల్లోకి తీసుకెళ్లుతున్నందుకు అభినందించారు. పాత ఆటో స్థానంలో కొత్త ఆటో ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు ఈరోజు భరత్ ను పిలిపించి కొత్త ఆటో ఇవ్వడంతోపాటు హిందుత్వ నినాదాలతోనున్న పాత ఆటోను స్వయంగా నడుపుకుంటూ దాదాపు 5 కి.మీలు వరకు వెళ్లడం విశేషం. మరోవైపు కరీంనగర్ లోని 38వ డివిజన్ లోని లక్ష్మీనగర్ లో రూ.70 లక్షల విలువైన యూఐడీఎఫ్ నిధుల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం 3వ డివిజన్ లోని విద్యారణ్యపురి బతుకమ్మ సర్కిల్ వద్ద రూ.48.5 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్లతోపాటు పలువురు బీజేపీ నేతలతోపాటు పెద్ద ఎత్తున స్థానికులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వాంగ్ చుక్ ఆమరణదీక్షకు మద్దతుగా కొవ్వొత్తుల ర్యాలీ

**లడఖ్ ఆణిముత్యం 'సోనమ్ వాంగ్ చుక్' ప్రాణాలు కాపాడండి!**

**పాలకుల నిర్లక్ష్యానికి కాలమే సమాధానం చెబుతుంది**

**ఖమ్మంలో మిన్నంటిన నిరసన జ్వాలలు..**

**కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని పౌరసమాజం డిమాండ్!**




**ఖమ్మం ప్రతినిధి, జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దేశ భవిష్యత్తు కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం తన జీవితాన్ని ధారపోసిన లడఖ్ అపూర్వ శాస్త్రవేత్త, మెగాసేసే అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్ష నేటికి 20వ రోజుకు చేరింది. ఆయన ప్రాణాలు గాల్లో దీపంగా మారి, చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నా... కేంద్ర ప్రభుత్వంలో కదలిక లేకపోవడంపై ఖమ్మం పౌరసమాజం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'వెలుగు రేఖలు ఎత్తి పడదాం' అనే నినాదంతో ఖమ్మం పౌరసమాజం, ప్రత్యామ్నాయ పౌర వేదిక సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం ముందు శుక్రవారం సాయంత్రం నిరసన జ్వాలగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ భావోద్వేగ భరిత కార్యక్రమానికి ప్రముఖ రచయిత, కవి, జర్నలిస్టు ఎన్. తిర్మల్ అధ్యక్షత వహించారు. ఆమరణ దీక్షతో క్షీణిస్తున్న శాస్త్రవేత్త ప్రాణాలు.. ఐక్యంగా నిలవాల్సిన సమయం ఆసన్నమైంది! "దేశం మెచ్చిన శాస్త్రవేత్త చావు నోటిలో ఉంటే పాలకులకు పట్టింపు లేదా? మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ వాంగ్ చుక్ ప్రాణాలను కాపాడుకోవడానికి ఐక్యంగా కదలాలి." అని వక్తలు పిలుపునిచ్చారు. సభలో అధ్యక్షత వహించిన ఎన్. తిర్మల్ మాట్లాడుతూ... దేశంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, కేంద్ర ప్రభుత్వ ప్రవేశపరీక్షల పేపర్లు లీక్ కావడం వల్ల అమాయక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పాలకుల గుండె కరగడంలేదని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ప్రధానమంత్రి ఆయనను మంత్రిమండలి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. **మొండివైఖరి వీడకుంటే దేశం అల్లకల్లోలం అవుతుంది : పౌరసమాజం హెచ్చరిక** సుమారు అరగంటకు పైగా సాగిన ఈ ప్రదర్శనలో ఖమ్మం చౌరస్తా నినాదాలతో ప్రతిధ్వనించింది. "సోనమ్ వాంగ్ చుక్ ను కాపాడాలి", "కేంద్ర ప్రభుత్వం మొండివైఖరి వీడాలి" అంటూ నాయకులు, ప్రజలు గొంతుకలిపారు. ఒక మహోన్నత శాస్త్రవేత్తకు ఏమైనా జరిగితే దేశం అల్లకల్లోలం అవుతుందని, పాలకుల నిర్లక్ష్యానికి కాలమే సమాధానం చెబుతుందని హెచ్చరించారు. కరిగిపోతున్న కొవ్వొత్తుల సాక్షిగా... సోనమ్ వాంగ్ చుక్ పోరాటానికి ఖమ్మం పౌరసమాజం సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ, ఆయన వెనుక తామంతా ఉన్నామని ఐకమత్యాన్ని చాటిచెప్పింది. ఈ నిరసనలో విద్యావేత్త రవిమారుత్, స్పర్శ అధ్యయన వేదిక కాకి భాస్కర్, ప్రజాస్వామ్య వాది డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, సింపోసియం నాయకురాలు బుగ్గవీటి సరళ, సిపిఐ నాయకులు శేషగిరిరావు, సిపిఐ (యం.యల్) మాస్లైన్ నాయకులు బి.పుల్లయ్య, సిపిఐ (యం.యల్) న్యూడెమోక్రసీ నాయకులు సాంబశివరావు, ఆఫ్ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు, బిఆర్ఎస్ నేత బిచ్చాల తిరుమలరావు, ఐఎంఏ నేత రెహనాబేగం, దేవిరెడ్డి విజయ్, మనోహర్ రాజు, టి.వేణు, ఐవి రమణారావు, డాక్టర్ భార్గవ్, బండిపద్మ, శిరోమణి, ఝాన్సీ పాల్గొని ప్రసంగించారు.

# ఆదర్శనగర్‌లో విద్యుత్ సమస్యకు చెక్..!

**● 26వ డివిజన్ శివాలయం వీధిలో**

**అధిక సామర్థ్యం గల కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం**





**కరీంనగర్, జూలై 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని 26వ డివిజన్ ఆదర్శనగర్ శివాలయం వీధిలో నెలకొన్న విద్యుత్ సమస్యకు పరిష్కారంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ప్రారంభించారు. గత కొన్ని రోజులుగా ఓవర్‌లోడ్ కారణంగా ఎస్ఎస్–33 ట్రాన్స్‌ఫార్మర్ తరచూ ట్రిప్ అవుతూ స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు స్పందించి పాత ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో అధిక సామర్థ్యం కలిగిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను మాజీ కార్పొరేటర్ వైద్యుల శ్రీదేవి అంజన్ కుమార్, ఆదర్శనగర్ శివాలయం వీధి పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు సహకరించిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శనగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు సత్యనారాయణ, కాసర్ల ప్రభాకర్, శివాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మెతుకు కనకయ్య, కార్యదర్శులు గండె లక్ష్మీనారాయణ, ఓ. మల్లయ్య, ఇట్టినేని శ్రీనివాస్, రమేష్, గోపి, జయలక్ష్మి, సుజాత, స్వాతి, శ్రీలత, నర్సయ్య, నరసయ్య, స్థానిక సబ్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వైద్యుల శ్రీధర్, లైన్‌మన్ మహేష్, వాడ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# రోడ్డు లేకపోయినా విధి నిర్వహణలో రాజీ లేదు

**దుర్గమ మార్గంలో డోలీలో రోగిని మోసిన 108 సిబ్బంది**

**సమయస్ఫూర్తితో గిరిజన యువకుడి ప్రాణాలు కాపాడిన వైనం**

**ప్రాథమిక చికిత్స అందించి ఆసుపత్రికి తరలింపు**





**ఏటూరునాగారం రూరల్:జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు మరోసారి బహిర్గతమయ్యాయి. గుర్రాలబావి గ్రామానికి చెందిన గోత్తికోయ గిరిజన యువకుడు మడకం అయితయ్య (18) తీవ్ర జ్వరంతో అపస్మారక స్థితికి చేరుకోగా, 108 అంబులెన్స్ సిబ్బంది సాహసోపేతంగా స్పందించి అతని ప్రాణాలను కాపాడారు. గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న అయితయ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ శివలింగం ప్రసాద్ మరియు పైలట్ కోటి వెంటనే గ్రామానికి చేరుకున్నారు. అయితే గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో బురద మార్గంలో కాలినడకన వెళ్లి బాధితుడిని చేరుకున్నారు. గ్రామస్తుల సహాయంతో అతడిని డోలీపై మోసుకుంటూ ప్రధాన రహదారి వరకు తీసుకొచ్చి అంబులెన్స్‌లోకి తరలించారు. **వైద్య సేవలు మరియు అభినందనలు** అంబులెన్స్‌లో ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా, బాధితుడికి రక్తంలో చక్కెర స్థాయి తగ్గిపోవడంతో పాటు తీవ్ర జ్వరం ఉన్నట్లు గుర్తించారు. ఈఆర్సీపీ వైద్యురాలు డాక్టర్ మౌనిక సూచనల మేరకు వెంటనే అత్యవసర చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. విధి నిర్వహణలో మానవత్వాన్ని చాటుకున్న 108 సిబ్బంది సేవలను స్థానికులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. గుర్రాలబావి వంటి గ్రామాల్లో ఇప్పటికీ అత్యవసర స్థితిలో డోలీలనే నమ్ముకోవాల్సిన దుస్థితి ఉండటంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ, అధికారులు వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ట్రైకార్ మెగా స్కిల్ సెంటర్ అవగాహన కార్యక్రమం

**షాద్ నగర్, జూలై 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అబ్దుల్లాపూర్‌మెట్ ట్రైకార్ మెగా స్కిల్ సెంటర్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, ప్లేస్‌మెంట్ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ సాయి మాట్లాడుతూ 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, సీఆర్ఎం, వేర్‌హౌస్ సూపర్వైజర్, వేర్‌హౌస్ అసోసియేట్, టెలికాం కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, టైలరింగ్, బ్యూటీ థెరపిస్ట్ వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం, అనంతరం ప్లేస్‌మెంట్ సౌకర్యం కూడా కల్పిస్తామని ఆయన వివరించారు. విద్యార్థులు తమ సందేహాలను ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్. కమల, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ పి. సత్యనారాయణ, కెమిస్ట్రీ విభాగాధిపతి విజయజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన దోస్త్ స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదలైందని ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్. కమల, దోస్త్ కోఆర్డినేటర్ పి. శ్రీనివాసులు తెలిపారు. జూలై 20 నుంచి 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, డిగ్రీ చదవాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# టిఆర్ఎస్ నాయకుని జన్మదిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ నీల దయాకర్

**రామన్నపేట జూలై 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** రామన్నపేట మండలం దుబ్బాక గ్రామ టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు గుండాల రాంబాబు జన్మదిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నీల దయాకర్ పాల్గొని సాల్వతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షులు పోషబోయిన మల్లేశం ఉప సర్పంచ్ చొప్పరి నరసింహ వార్డ్ మెంబర్ భైరోజు పురుషోత్తం పాల సంఘం చైర్మన్ చెన్నకేశవులు నాయకులు పొనుగోటి వెంకటేశ్వరరావు ఆకుల పురుషోత్తం గుండాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు

# తండ్రికి తగ్గ తనయుడు 'పులి మధు'

**బాల్ బ్యాడ్మింటన్‌లో 'డాక్టరేట్' పట్టా**

**అంకితభావంతో పరిశోధన.. కఠోర శ్రమకు దక్కిన పీహెచ్.డి గౌరవం**



**ఖమ్మం ప్రతినిధి, జూలై 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కృషి, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని నిరూపించారు ఖమ్మం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సహాయ ఆచార్యులు పులి మధు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, అంకితభావంతో ఆయన చేసిన సుదీర్ఘ పరిశోధనకు అత్యున్నత గుర్తింపు లభించింది. తమిళనాడులోని ప్రసిద్ధ అన్నామలై విశ్వవిద్యాలయం శారీరక విద్య విభాగం నుంచి ఆయన పీహెచ్.డి (డాక్టరేట్) పట్టా అందుకున్నారు. ప్రముఖ మార్గదర్శకులు డాక్టర్ బి. భారతి రాజ్ పర్యవేక్షణలో.. "విశ్వవిద్యాలయ పురుషుల బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులలో ప్రధానంగా ప్రభావం చూపే అంశాలపై విమర్శనాత్మక విశ్లేషణ" అనే క్లిష్టమైన అంశంపై మధు పరిశోధన సాగించారు. ఒక క్రీడాకారుడి ప్రతిభను, వారిపై ప్రభావం చూపే మానసిక, శారీరక అంశాలను శాస్త్రీయంగా విశ్లేషించడం వెనుక ఆయన పడ్డ కష్టం, అంకితభావం ఈ రోజు డాక్టరేట్ రూపంలో ప్రతిఫలించింది. ఖమ్మం నగరానికి చెందిన 'పులి మధు' ఆయన సాధించిన ఈ ఘనత పట్ల సహచర అధ్యాపకులు, క్రీడా ప్రముఖులు, మిత్రులు, ఖమ్మం నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనల జల్లు కురిపిస్తున్నారు. **తండ్రి జ్ఞాపకాలే స్ఫూర్తిగా.. క్రీడారంగానికి అనన్య సేవ** పులి మధు సాధించిన ఈ విజయం వెనుక ఒక భావోద్వేగభరితమైన మానవీయ కోణం దాగి ఉంది. ఆయన తండ్రి, స్వర్గీయ పులి రామస్వామి ఎస్.ఆర్ అండ్ బి.జి.ఎన్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) గా పనిచేసి, క్రీడారంగానికి ఎనలేని సేవలు అందించారు. నిరుపేద విద్యార్థులు ఫీజులు కట్టలేని స్థితిలో ఉంటే, తన సొంత డబ్బిచ్చి చదివించిన దయా హృదయుడాయన. ఎంతోమంది పేద విద్యార్థులను జాతీయ, విశ్వవిద్యాలయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తి. 2024 అక్టోబర్ 21న రామస్వామి పరమపదించడం క్రీడాలోకానికి తీరని లోటు మిగిల్చింది. తండ్రి స్వయంగా రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కావడంతో, తండ్రికి ఇష్టమైన అదే బాల్ బ్యాడ్మింటన్ క్రీడనే పులి మధు తన పరిశోధనాంశంగా ఎంచుకున్నారు. తండ్రి ఆశయాలను గుండెల్లో నింపుకుని, ఆయన చూపిన బాటలోనే నడుస్తూ ఈ డాక్టరేట్ సాధించి 'తండ్రికి తగ్గ తనయుడు' అనిపించుకున్నారు. అంతేకాదు, తండ్రిపై ఉన్న గౌరవంతో, ఆయన శిష్యులందరినీ ఏకం చేసి, రామస్వామి జ్ఞాపకార్థం ఒక అద్భుతమైన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను కూడా నిర్వహించి పితృభక్తిని చాటుకున్నారు. తండ్రి ఆశయాలకు వారసుడిగా నిలిచి, ఆయన కీర్తిని మరింత పెంచిన 'పులి మధు'ను ఖమ్మం క్రీడాలోకం ప్రశంసలతో ముంచెత్తుతోంది.

# 26వ వార్డులో నూతన బోర్ మోటార్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్

**- సాంబశివ కాలనీలో పార్కు మరమ్మతుల పనులను పరిశీలించిన చైర్మన్**



**షాద్ నగర్, జూలై 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** షాద్‌నగర్ పట్టణంలోని 26వ వార్డు ఆర్ఆర్ మోటార్స్ గల్లీలో ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించే ఉద్దేశ్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్ మోటార్‌ను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీ ఖాన్ బాబర్‌తో కలిసి సాంబశివ కాలనీలో కొనసాగుతున్న పార్కు మరమ్మతుల పనులను పరిశీలించారు. పార్కును ప్రజలకు అనుకూలంగా తీర్చిదిద్దేలా పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక 26వ వార్డు కౌన్సిలర్ ఎస్పీ శివ కాలనీలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు తదితర పలు సమస్యలను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిశీలించిన చైర్మన్ వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు ఇండస్ట్రీని ఆకాశానికెత్తిన రకుల్ ప్రీత్.. బాలీవుడ్‌పై తీవ్ర విమర్శలు



టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల పనితీరుపై కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని సహకార స్ఫూర్తిని కొనియాడిన ఆమె, బాలీవుడ్‌లో మాత్రం అభద్రతాభావం, అసూయ వంటి ధోరణులు ఎక్కువగా కనిపిస్తాయని అభిప్రాయపడ్డారు.

ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్, తన సినీ ప్రయాణం మొదలైన తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రశంసలు కురిపించారు. “టాలీవుడ్‌లో ఒకరి సినిమాలను మరొకరు బహిరంగంగా ప్రోత్సహిస్తారు. తోటి నటీనటుల చిత్రాల ట్రైలర్లను వడుదల చేయడం, వేడుకలకు హాజరవ్వడం వంటివి ఇక్కడ సాధారణం. వృత్తిపరమైన పోటీ ఉన్నప్పటికీ, ఒకరి విజయాన్ని మరొకరు మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తారు“ అని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంలో బాలీవుడ్ పరిస్థితి భిన్నంగా ఉంటుందని, అక్కడ అసూయ, అభద్రతాభావం కారణంగా పరస్పర సహకారం చాలా తక్కువని ఆమె అన్నారు. కొందరు కావాలనే ఇతరులపై ప్రతికూల ప్రచారాలు (నెగెటివ్ పీఆర్ క్యాంపెయిన్లు) నిర్వహిస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. “తెలుగు పరిశ్రమలో ఐక్యత, సహృద్భావం మెండుగా ఉంటాయి. ఈ లక్షణాలను హిందీ పరిశ్రమ కూడా అలవర్చుకుంటే అది మరింత బలోపేతం అవుతుంది“ అని రకుల్ సూచించారు. గతంలోనూ అల్లు అర్జున్, మహేశ్ బాబు వంటి అగ్ర హీరోల వినయాన్ని, వృత్తి పట్ల వారికున్న నిబద్ధతను ఆమె కొనియాడారు. దక్షిణాదిలో గడించిన అనుభవాలే తన కెరీర్‌ను తీర్చిదిద్దాయని, ఇక్కడి ప్రేక్షకుల ఆదరణ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఆమె కృతజ్ఞత చాటుకున్నారు. రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తన ఎదుగుదలకు తోడ్పడిన పరిశ్రమ పట్ల ఆమె చూపిన గౌరవానికి నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నలుగురు హీరోయిన్లు?


**రాఘవ లారెన్స్ 30వ సినిమాపై ఆసక్తికర ప్రచారం**


**లారెన్స్ సరసన సాయి పల్లవి, జాన్వీ, రుక్మిణి, కయాదు**

**ఇది లారెన్స్ సొంత నిర్మాణ సంస్థలో రానున్న చిత్రం**

**నూతన దర్శకుడు తిరుపుగల్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్న వైనం**







నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచే 30వ సినిమాకు సిద్ధమవుతున్నారు. ‘ా-30‘ అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌ను ఇటీవలే అధికారికంగా ప్రకటించారు. అయితే, సినిమా ప్రారంభం కాకముందే దీని క్యాస్టింగ్ సంచలనంగా మారింది. ఈ చిత్రంలో ఒకరు కాదు, ఏకంగా నలుగురు ప్రముఖ హీరోయిన్లు నటించనున్నారంటూ వార్తలు వచ్చాయి. ఈ భారీ చిత్రంలో సాయి పల్లవి, జాన్వీ కపూర్, రుక్మిణి వసంత్, కయాదు లోహర్ కీలక పాత్రలు పోషించనున్నారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ నలుగురు నటీమణులకు ఉన్న క్రేజ్ దృష్ట్యా సౌత్ ఇండియన్ సినిమాలో ఇది చర్చనీయాంశం అయింది. దాంతో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి.

ఈ చిత్రాన్ని రాఘవ లారెన్స్ తన సొంత నిర్మాణ సంస్థ ‘రాఘవేంద్ర ప్రొడక్షన్స్‘ బ్యానర్‌పై నిర్మిస్తుండటం విశేషం. తిరుపుగల్ అనే నూతన దర్శకుడు ఈ సినిమాతో పరిచయం అవుతున్నారు. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాపై హీరోయిన్ల వార్తలతో ప్రేక్షకుల్లో ఆసక్తి రెట్టింపైంది.

# ఉప ఎన్నికలకు సిద్ధం

## టాలీవుడ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ సంచలన నిర్ణయం..




టాలీవుడ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ (ఙఖీణణూ) కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం అసోసియేషన్ ఎన్నికలకు సిద్ధమవుతున్నట్టు ప్రకటించింది. ఫెడరేషన్ జోక్యాన్ని ఖండిస్తూ లేఖ విడుదల చేసిన అసోసియేషన్, ఖాళీ అయిన పోస్టులకు ఎన్నికలు నిర్వహించాలని మెజార్టీ సభ్యుల డిమాండ్ మేరకు ఉప ఎన్నికలకు నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రక్రియను జులై 20న నామినేషన్లు దాఖలు స్వీకరించడంతో ప్రారంభించనున్నట్లు అసోసియేషన్ ప్రకటించింది. ఎన్నికల అధికారి అదే రోజు నుంచి నామినేషన్ల పరిశీలన చేయనున్నట్లు తెలిపింది. జులై 22 వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసింది.

ఎన్నికల నిబంధనల ప్రకారమే ఈ ఎలక్షన్స్ జరుగుతాయని అసోసియేషన్ తెలిపింది. అసోసియేషన్‌లో ఇటీవల జరిగిన వివాదం నేపథ్యంలో 10 మంది సభ్యులను సస్పెండ్ చేశారు. మిగిలిన ఆరుగురు కూడా ఉప ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించడంతో అసోసియేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు అసోసియేషన్ స్పష్టం చేసింది.

# సరికొత్త సామాజిక క్యాంపెయిన్.. రకుల్, సమంతలకు కాజల్ సవాల్!

ఆహార కల్తీ, ప్రజలపై పడుతున్న దుష్ప్రభావాలపై క్యాంపెయిన్

మనం తినే ఆహారం నిజంగానే సురక్షితమా అని ప్రశ్న

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన లేటెస్ట్ చిత్రం ‘ది ఇండియన్ స్టోరీ’ ప్రమోషన్స్‌లో భాగంగా సామాజిక అవగాహన క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. పురుగుమందుల వాడకం, ఆహార కల్తీ, దానివల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను ఈ సినిమాలో చూపించారు. చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో కాజల్, శ్రేయస్ తల్పడే జంటగా నటించారు.

ఈ క్రమంలో, కాజల్ #WhatsOnYourPlateμ (మీ ప్లేట్ లో ఏముంది) అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. తన రాత్రి భోజనం ఫోటోను సోషల్ మీడియాలో పంచుకుంటూ, మనం తినే ఆహారం నిజంగా సురక్షితమేనా అని ప్రశ్నించింది. ప్రతి ఒక్కరూ తాము తినే ఆహారం పట్ల మరింత శ్రద్ధ వహించాలని కోరింది. ఈ ఛాలెంజ్‌లో టాలీవుడ్ స్టార్ హీరోయిన్లు రకుల్ ప్రీత్ సింగ్, సమంతలను కూడా పాల్గొనమని సవాల్ విసిరింది.

నటుడు శ్రేయస్ తల్పడే కూడా కాజల్ అభిప్రాయాన్ని బలపరుస్తూ పోస్ట్ చేశాడు. ప్రజలందరూ బాధ్యతాయుతమైన వినియోగదారులుగా మారాలని, మనం ప్లేట్లలో పెట్టుకుని తినే ఆహారం వెనుక ఉన్న అసలు నిజాలు, నివేదించబడని సమస్యలపై చర్చ జరగాలని శ్రేయస్ పిలుపునిచ్చాడు.

ఈ చిత్రం వివరాల్లోకి వస్తే... జీ స్టూడియోస్, ఎమ్ఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్ సమర్పకులుగా



# సోనమ్ వాంగ్‌చుక్‌ను చూసి ‘3 ఇడియట్స్’ హీరో పాత్రను రూపొందించలేదు: ఆమిర్ ఖాన్





బాలీవుడ్ సూపర్ హిట్ చిత్రం ‘3 ఇడియట్స్’లోని ఫున్‌సుఖ్ వాంగ్డూ పాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ పాత్రను అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్ పోషించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ పాత్రకు లడఖ్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ స్ఫూర్తి అని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ విషయంపై ఆమిర్ ఖాన్ స్వయంగా స్పందించారు. ఆ ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సోనమ్ వాంగ్‌చుక్‌కు, ఆ పాత్రకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. లండన్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమిర్ మాట్లాడారు. ‘3 ఇడియట్స్’ కథా చర్చల సమయంలో తమకు సోనమ్ వాంగ్‌చుక్ గురించి తెలియదని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా కూడా ఆయన్ను ఎప్పుడూ కలవలేదని చెప్పారు. అందుకే ఫున్‌సుఖ్ వాంగ్డూ పాత్రను ఆయన జీవితం ఆధారంగా రూపొందించలేదని స్పష్టం చేశారు. ఈ సినిమాలో ‘చతుర్’ పాత్ర పోషించిన ఓమీ వైద్య విడుదల చేసిన ఒక వీడియోపై కూడా ఆమిర్ స్పందించారు. ఫున్‌సుఖ్ పాత్ర సోనమ్ వాంగ్‌చుక్‌ను చూసి రూపొందించారని ఓమి చెప్పడం సరికాదని ఆయన అన్నారు. ఆ వ్యాఖ్యల్లో వాస్తవం లేదని తేల్చిచెప్పారు. అయితే, సోనమ్ వాంగ్‌చుక్ చేస్తోన్న సామాజిక సేవలను తాను ఎంతగానో గౌరవిస్తానని ఆమిర్ తెలిపారు. ప్రస్తుతం ఆయన చేస్తోన్న నిరవధిక నిరాహార దీక్ష గురించి ప్రస్తావిస్తూ.. సోనమ్ ఆరోగ్యం క్షీణిస్తోందని, దీక్ష విరమించాలని పలువురు కోరుతున్నారని చెప్పారు. వాంగ్‌చుక్‌ను గౌరవించడానికి ‘3 ఇడియట్స్’ పాత్రతో ముడిపెట్టాల్సిన అవసరం లేదని, ఆయన చేస్తోన్న కృషి అసామాన్యమైనదని ఆమిర్ కొనియాడారు. నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో సోనమ్ వాంగ్‌చుక్ గత 20 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. రోజురోజుకూ ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండడంతో వెంటనే దీక్ష విరమించాలని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం ఆయన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవడం లేదనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

# ఓటీటీలోకి వచ్చేసిన ‘మా ఇంటి బంగారం’..



స్టార్ హీరోయిన్ సమంత సుమారు మూడేళ్ల విరామం తర్వాత ‘మా ఇంటి బంగారం‘ చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. థియేటర్లలో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయిలో వసూళ్లు రాబట్టిన ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు ఓటీటీ వేదికపైకి వచ్చేసింది. హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాల్లో రూ. 100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన తొలి తెలుగు సినిమాగా చరిత్ర సృష్టించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, ఇప్పుడు డిజిటల్ ప్రియుల ముందుకు వచ్చింది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ ‘జియో హాట్‌స్టార్‘ దక్కించుకుంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే గురువారం అర్ధరాత్రి నుంచే ఈ చిత్రం స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేశారు. దీంతో దక్షిణాది సినీ ప్రియులు ఈ చిత్రాన్ని వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు. థియేటర్లలో కుటుంబ ప్రేక్షకులను, ముఖ్యంగా మహిళలను ఎంతగానో ఆకట్టుకున్న ఈ సినిమా, ఇప్పుడు ఓటీటీలోనూ అదే ఆదరణ పొందుతుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది.